


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 04-12-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 72 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### అధికారంలోకి రాగానే

## 'నవరత్నాలు'తో ఆదుకుంటా

- శాటిలైట్ సిటీ అన్నారు.. ఎక్కడైనా కనిపించిందా?
- బాబు ఇక్కడ చేసిందేం లేదు
- ఓట్లు, సీట్లు కోసమే ప్రజలను వాడుకున్నారు
- రాజాంలో రాజన్న బిడ్డ జగనన్న బహిరంగ సభ



రాజాం : సీఎం చంద్రబాబు నాయుడు రాజాంలో శాటిలైట్ సిటీ కడతానన్నారు.. ఎక్కడైనా మీకు కనిపించిందా? అని ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రశ్నించారు. సీనియర్‌నని చెప్పుకునే చంద్రబాబు శ్రీకాకుళం జిల్లాకు చేసిందేమి లేదని ఆయన దుయ్యబట్టారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 311వ రోజు సోమవారం శ్రీకాకుళం జిల్లా రాజాంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌ను గెలిపించాలని, ప్రత్యేక హోదా సాధనకు కృషి చేద్దామని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ సభలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**ఓట్లు, సీట్ల కోసమే జిల్లాను వాడుకుంటున్నారు**

చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఓట్లు, సీట్లు కోసమే శ్రీకాకుళం జిల్లాను వాడుకున్నారు. ఆయన పాలనలో శ్రీకాకుళం, రాజాంలకు ఒరిగిందేం లేదు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే రాజాం ప్రాంతంలో అభివృద్ధి జరిగిందని ఇక్కడి ప్రజలు నాతో చెప్పారు. వైఎస్సార్ హయాంలోనే ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, రోడ్ల విస్తరణ జరిగాయి. 38వేల మందికి పెన్షన్లు ఇచ్చారు. 32 వేల ఇళ్లలు కట్టించారు. రెసెడెన్షియల్ కాలేజీ కూడా ఆ దివంగత నేత హయాంలోనే

తరువాయి 2లో..

### నా కృషితోనే భాగ్యనగరానికి

# అభివృద్ధి



- ఔటర్ రింగ్‌రోడ్డు, మెట్రో రైలు, హైటెక్ సిటీ
- ప్రజాకూటమి అభ్యర్థి అనిల్‌కుమార్‌కు మద్దతు
- కేసీఆర్ పాలనపై విమర్శనాస్త్రాలు
- తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు

హైదరాబాద్: గతంలో తాను తీసుకున్న చర్యల వల్లే హైదరాబాద్ ఆదాయం పెరిగిందని తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తాను చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్లిందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజాకూటమి అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌కు మద్దతుగా ఆయన రోడ్‌షోలు నిర్వహించారు. రామ్‌నగర్, ముషీరాబాద్

తరువాయి 2లో..

## ప్రజాభీష్టమే గెలవాలి

- ప్రధానమంత్రి పచ్చి అబద్ధాలు చెబుతున్నారు
- నేను ప్రజల ఏజెంట్‌ని
- కోదాడ బహిరంగ సభలో కేసీఆర్



కోదాడ: మన దేశంలో ప్రధానమంత్రి కూడా పచ్చి అబద్ధాలు చెబుతున్నారని సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. అది దేశ ప్రజల దురదృష్టమని వ్యాఖ్యానించారు. దేశంలో రాజకీయ పరిస్థితులు అలా వున్నాయని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో పరిస్థితి చాలా విచిత్రంగా ఉందని పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ నిజామాబాద్ సభలో మాట్లాడుతూ.. తెలంగాణలో కరెంటు, నీటి సమస్య ఉందని విమర్శలు చేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా కేసీఆర్ యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఏజెంట్ అని మోదీ అంటారని, రాహుల్ గాంధీయేమో కేసీఆర్ మోదీకి ఏజెంట్ అంటున్నారని చెప్పారు. కేసీఆర్ ఎవరికీ ఏజెంట్ కాదని, తాను ప్రజలకే ఏజెంట్‌నని

తరువాయి 2లో..

## గద్వాలలో రాహుల్ గర్జన

- బంగారు తెలంగాణ కాదు..
- బంగారు కుటుంబం
- కేసీఆర్ కుటుంబంపై విమర్శల వెల్లువ



గద్వాల: నాలుగున్నరేళ్ల క్రితం బంగారు తెలంగాణ వస్తుందని ప్రజలు కలలు కంటే.. బంగారు కుటుంబం మాత్రమే వచ్చిందని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ప్రజల కలలను నాలుగున్నరేళ్ల కేసీఆర్ పాలనలో కూల్చేశారని, రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసి కేవలం తమ ఆస్తులను మాత్రమే పెంచుకున్నారని ఆరోపించారు. గద్వాలలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ

తరువాయి 2లో..

## 4.93 లక్షల బోగస్ ఓట్లు తొలగించాం

- పార్టీల మేనిఫెస్టోలు, హామీలను పరిశీలిస్తున్నాం
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ తెలిపారు. ఎన్నో సవాళ్లను అధిగమించి నెల రోజుల్లోనే ఎన్నికలకు సిద్ధమయ్యామని తెలిపారు. మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ అనేది ఒక సవాల్ అన్నారు. న్యాయపరంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నామని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించిందన్నారు. మొత్తం 4.93 లక్షల బోగస్ ఓట్లు లేకుండా

తరువాయి 2లో..

## ఏపీలో పది పరీక్షల షెడ్యూల్ విడుదల

- నెల రోజులకే ఫలితాల విడుదల
- విడుదల చేసిన మంత్రి గంటా శ్రీనివాసరావు



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేశారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. పరీక్షల దరఖాస్తుకు ఈ నెల 7న చివరి తేదీగా పేర్కొన్నారు. పరీక్షలకు మొత్తం 6.10 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, 2,833 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. 91 సమస్యాత్మక పరీక్ష కేంద్రాలు గుర్తించామని, ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. హాల్‌టికెట్లను ప్రధానోపాధ్యాయులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

తరువాయి 2లో..

### మెగా గ్రౌండ్ మేళాను

## విజయవంతం చేయండి

- 28న నిర్వహించనున్న 3వ విడత మేళాకు సీఎం హాజరు
- పెద్ద ఎత్తున పాడిపశువుల పంపిణీ
- బ్యాంకర్లు సహకరించకుంటే డిపాజిట్ల నిలిపివేత
- జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్

విశాఖపట్నం: ఈ నెల 6వ తేదీన రెండో విడత నిర్వహించే మెగా గ్రౌండింగ్ మేళాను విజయవంతం చేసేందుకు బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ కోరారు.

సోమవారం కలెక్టరేట్ అధ్యక్షతన ప్రత్యేక డీసీసీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎకనమిక్ సపోర్ట్ స్కీమ్స్ మరియు ఆదరణ పథకాల కింద నిరుపేదలకు 2016 సంవత్సరం నుండి ఈ ఏడాది వరకు మంజూరు చేసిన పలు యూనిట్ల గ్రౌండింగ్ మేళా తొలి విడత కార్యక్రమాన్ని ఇప్పటికే జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు.

అదే తరహాలో 6న నిర్వహించనున్న మేళాను విజయవంతం చేయాలని కోరారు. బ్యాంకుల వద్ద చాలా దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని క్లియర్ చేయాలని బ్యాంకు అధికారులను కోరారు. ఇందుకు సహకరించని బ్యాంకర్లకు డిపాజిట్లు ఉపసంహరిస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

3వ విడత మేళాలో పాడి పశువుల పంపిణీకి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులకు వెంటనే అందజేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఎల్.డి.ఎం. శ్రీనాథ్ ప్రసాద్, ఏఎల్‌డిఎం జెఎల్ఎన్ మూర్తిపై కలెక్టర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్-2 ఎ. శిరి, ఎల్‌డిఎం శ్రీనాథ్ ప్రసాద్, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ ఎస్. శ్రీనివాసరావు, ఎస్.సి. కార్పొరేషన్ ఇడి రమణ, బి.సి. కార్పొరేషన్ ఇడీ గీతాదేవి, సోషల్ వెల్ఫేర్ డీడీ వి. జయప్రకాష్, వికలాంగ శాఖ ఏడీ వెంకటేశ్వరరావు, మైనారిటీస్ కార్పొరేషన్ ఇడీ శాస్త్రి, తదితరులతో పాటు పలు బ్యాంకుల కంట్రోలర్లు, బ్రాంచ్ మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



# తెదేపా నాయకులు రాయితీలు దోచుకుంటున్నారు

## భాజాపా అధ్యక్షుఃడు యెనిమిరెడ్డి మాలకొండయ్య

కాకినాడః సామాన్య ప్రజలుకు అందాల్సిన సంక్షేమ ఫలాలు ఇళ్లు, మరుగుదొడ్లు, కార్పొరేషన్ రుణాలు ఇలా ఏది దొరికితే అందులో తెదేపా నాయకులు దోచుకుంటున్నారని భారతీయ జనతా పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య ఆరోపించారు. ప్రతీ సోమ వారం నిర్వహిస్తున్న గ్రీవిన్స్ లో భాగంగా వచ్చిన సమస్యల పై ఆయన మాట్లాడుతూ పిఎంఎవై పథకం కింద పేదలకు ఇవ్వాల్సిన ఇళ్లు వారు రూ.25 వేలు డ్రాఫ్ట్ ఇచ్చినా ఇంతవరకు కేటాయింపులు జరగలేదు అని వారికి ఎలాగైన న్యాయం చేయాలని కోరుతూ అర్జీ ఇవ్వడం జరిగింది.

ఆటో కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ ల గురించిన వివరాలు సరిగ్గా అవగాహన కల్పించక పోవడముతో వాళ్లు ప్రైవేట్ బ్యాంక్‌ల ద్వారా రుణాలు తీసుకుని అప్పులు కట్టలేక అదే ఆటో అమ్ముకోవలసిన దుస్థితి వస్తుందని. కార్పొరేషన్ రుణాలు కోసం పెట్టిన అవి కేటాయింపులో అవినీతి జరుగుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం మేము వెంటనే బిసీ,ఎస్సీకార్పొరేషన్ వాళ్ళని సంప్రదించి అర్హులైన వారికి ఎలాగైనా రాయితీ కింద రుణాలు ఇప్పించి విధంగా కృషి చేస్తామన్నారు. ఇంకా ఉపాధిహామీ పథకంలో రైతులకు పనిముట్లు కొనుక్కోవడానికి ఇవ్వాల్సిన రుణాలు కూడా పక్కా దారి పడుతున్నాయన్నారు. అని స్థానిక ఎమ్మెల్యే సిఫార్సు లేకపోతే కనీసం దరఖాస్తు కూడా తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని మాలకొండయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు చిట్నీడి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిబాబా, జిల్లా ప్రధాన కార్యదర్శి రంభాల వెంకటేశ్వరావు, కార్పొరేటర్లు సాలగ్రామ లక్ష్మీప్రసన్న, నల్లబిల్లి సుజాత, గ్రీవిన్స్ కన్వీనర్ కెంగం హరి రామ ప్రసాద్, చక్రి తదితరులు పాల్గొన్నారు.

# చిల్డ్రన్ ఫెస్టివల్ ద్వారా చిన్నారుల్లో చైతన్యం బలోపేతం

## శ్రీరామ చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి వేదుల మధురవాణి

విశాఖపట్నంః చిన్నారుల్లో సృజనాత్మకత, నూతన చైతన్యాన్ని బలోపేతం చేసే దిశగా డిసెంబర్ 13 నుంచి మూడు రోజుల పాటు జరిగే చిల్డ్రన్ ఫెస్టివల్-2018కి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీరామ చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి వేదుల మధురవాణి తెలిపారు. ఈ ఉత్సవాలను సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, స్థానిక ఎస్‌కోట శాసన సభ్యురాలు కె.లలితకుమారిలు ప్రారంభిస్తారు. ప్రముఖ గణిత శాస్త్ర నిపుణులు, ఆంధ్రవిశ్వ కళాపరిషత్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్.అవధాని ప్రధాన ప్రసంగం చేస్తారు.

ప్రముఖులైన సాహితివేత్త ఆచార్య కె.మలయవాసిని, గణిత శాస్త్రవేత్త ఆచార్య సీఎన్‌రావు, వైద్య నిపుణులు ఆచార్య డి.కె.సుబ్రహ్మణ్యరెడ్డి, పర్యావరణ వేత్త ఆచార్య కె.పి.ఆర్.విటల్ మూర్తి, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ ఆచార్య హరిరామమూర్తి, సంగీత విద్వాంసులు బండారు చిట్టిబాబు తదితరులు హాజరవుతున్నారు.

చిన్నారుల్లో దాగివున్న తేజోవంతమైన ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు తెలుగు భాషపై మక్కువను పెంచే విధంగా ఈ ఉత్సవాలను గత 18ఏళ్లగా నిర్వహిస్తున్నామన్నారు. వివిధ జిల్లాల నుంచి 20వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన 5 పాఠశాలలకు నగదు పురస్కారం ఇస్తారు. ధ్రువీకరణ పత్రం అందిస్తారు.

# చంద్రన్న బీమా పథకంలో జిల్లా ఫస్ట్

## కలెక్టర్ హరిజవహర్‌లాల్



విజయనగరం: చంద్రన్న భీమా పథకం క్రింద క్లయిములు త్వరితగతిన పరిష్కరించడంతోపాటు సంతృప్తికరగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ ఆదేశించారు. ఈ పథకంపై కలెక్టర్ సమీక్షిస్తూ.. ఇంతవరకు 12 లక్షల 55 వేల 892 మంది నమోదు అయ్యారని అందులో 2915 క్లయిములు మరణించిన రోజు నమోదు అయి 96.66శాతంగా నిలిచి రాష్ట్రంలో మన జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. 2745 మందికి వారంరోజుల్లోనే నామినికి 5 వేల రూపాయలు అందించామన్నారు. మరణం జరిగిన 48 గంటల్లో పంచాయితీ కార్యదర్శి, మున్సిపల్ కమీషనర్ లాగ్ నుండి అప్‌లోడ్ అయ్యేలా డిపిఓ, కమీషనర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ తిరస్కరిచంచిన క్లయిములు సత్వరము లేబర్ డిపార్ట్‌మెంట్ ఎంక్వారీ చేసి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో పిడి.డిఆర్‌డిఎ సుబ్బారావు, అడిషనల్ ఎస్పీ నరసింహరావు, డి.ఎం.హెచ్.ఓ డా.విజయలక్ష్మి, డా.ఉషశ్రీ, డిసిఓ సత్యనారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.



అవినీతిపై రాజీ లేని పోరాటం చేస్తామని అంటున్న జనసేన పాడేరు డివిజన్ నాయకులు వంపురు గంగలయ్య, కిట్లంగి పద్మ తదితరులు

# ప్రతిభా భారతి కుటుంబ సభ్యులను పరామర్శించిన అశోక్‌గజపతి



విజయనగరం : ప్రతిభా భారతి తండ్రి జస్టిస్ పున్నయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో సోమవారం సాయంత్రం మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు ప్రతిభా భారతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న ప్రతిభాభారతిని కూడా పరామర్శించారు. కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం




ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 28 రోజులు, టైం స్కేల్ ఉద్యోగులకు శాస్వత ఉద్యోగ బధ్రత కల్పించాలని కోరుతూ ఉద్యోగులు చేస్తున్న నిరసనలు, దీక్షలు కొనసాగాయి. ఏయూ పరిపాలనా భవనం వద్ద ఉదయం 10 గంటల నుంచి నిరసనలు కొనసాగాయి. పెద్దసంఖ్యలో ఉద్యోగులు పాల్గొని తమ న్యాయబద్ధమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఏయూ పరిపాలనా భవనం ఎదురుగా ఏయూజేఏసి అద్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్ అధ్వర్యంలో ఉద్యోగు లంతా ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరి ంచని పక్షంలో సమ్మెకు దిగుతామన్నారు. వర్సిటీ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు అందించాలన్నారు. ఈ దిశగా పాలకులు పనిచేయాలన్నారు. ఆర్గనైజంగ్ సెక్రటరీ ఇ.లక్ష్మణ రావు,జాయింట్ సెక్రటరీలు ఎస్.కె ఫరీద్‌లు మాట్లాడుతూ సమస్య పరిష్కరించని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. జేఏసీ చైర్మన్ ఆచార్య జాలాది రవి మాట్లాడుతూ వర్సిటీ ఉన్నతాధికారులు వెంటనే ఉద్యోగుల సమస్యలపై స్పందించాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఆచార్య డి.వి రామకోటి రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అధికారుకలకు ఉద్యోగుల సమస్యలు పట్టడం లేదన్నారు.

**పలువురు సంఘీభావం...**

జేఏసీ దేక్ష శిబిరాన్ని తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు వెలగపూడి రామక్రిష్ణ బాబు సందర్శించారు. ఉద్యోగులకు తన సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, త్వరలో సానుకూల నిర్ణయం వచ్చే విధంగా కృషిచేస్తానన్నారు. ఈ నెల 5వ తేదీలోగా సమస్య పరిష్కారానికి పనిచేస్తున్నానన్నారు.

వైఎస్ఆర్‌సిపి విశాఖ పార్లమెంట్ అద్యక్షుడు తైనాల విజయ్ కుమార్ దీక్ష శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఉద్యోగుల డిమాండ్లను మానవతా దృక్పధంతో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాంతారావు, జేఏసీ కార్యదర్శి కె.అప్పారావు, ఆర్గనైజంగ్ సెక్రటరీ ఇ.లక్ష్మణ రావు, వర్కింగ్ సెక్రటరీ సి.హెచ్.ఎన్ సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ ఎస్.కె ఫరీద్, మొల్లి అప్పలరాజు, తదితరులు ప్రసంగించారు.

# ఎస్సీ సెల్ కాకినాడ పార్లమెంట్ కార్యదర్శిగా వైఎస్



శంఖవరం : తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పార్లమెంటరీ ఎస్సీసెల్ కార్యదర్శిగా ఎడ్ల. సత్యనారాయణ(వైఎస్) ,శంఖవరం మండలం ఎస్సీ సెల్ కన్వీనర్‌గా మాతా శామ్యూల్ రాజ్‌లను నిమించినట్లు ప్రత్తిపాడు కో-ఆర్డినేటర్ పర్వత ప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా ఎడ్ల సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్ నవరత్నాలను ప్రతి ఇంటికీ తీసుకొని వెళ్ళి పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచనలేని కృషి చేస్తానన్నారు. పేద ,దళిత జాతి అభ్యున్నతికి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఎంతో పాటు పడ్డారని ఆయన బాటలోనే తనయుడు జగన్ కూడా పయనిస్తున్నాడన్నారు. దళిత ,పేద వర్గాలు వైఎస్ జగన్ వెంటే ఉన్నారన్నారు.ఈ సందర్భంగా వైఎస్,శామ్యూల్ లను అభినందించి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడప సోమేశ్, సకురు గుర్రాజు, నరాల శ్రీను, పిర్ల నాగేశ్వరరావు, ఈగల అప్పారావు, గాబు కృష్ణ, రావూరి వెంకటేశ్వరరావు, భారీ స్థాయిలో కార్యకర్తలు మహిళలు అభిమానులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

# అధికారంలోకి రాగానే 'నవరత్నాలు'తో ఆదుకుంటా

వచ్చింది. తోటపల్లి ప్రాజెక్ట్ పనులు పరుగెత్తాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ మిగిలిన పనులను కూడా పూర్తి చేయలేకపోయారు. తోటపల్లి ఎడమ, కుడి కాల్వ ఆధునిక పనులు చేస్తామన్నారు. నాలుగన్నరేళ్లలో చేయని చంద్రబాబు.. మూడు నెలల్లో చేస్తానంటున్నారు. ఇప్పుడు టెండర్లు పిలుస్తున్నారు. టెంకాయిలుకొట్టి డ్రామాలు చేస్తున్నారు. సంతకవిటీ, రాజాం, రేగిడి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. నాలుగన్నరేళ్ల చంద్రబాబు పాలనలో కనీసం పిల్లకాల్వలు కూడా పూర్తి చేయలేకపోయారు. రాజాంలో శాటిలైట్ సిటీ, నాలుగు చెరువులను పార్కులుగా చేస్తామన్నారు. చేశారా? అవి కనిపించాయా? (ప్రజల నుంచి లేదు లేదు.. సమాధానం). డిగ్రీ కాలేజీ భవనాల నిర్మిస్తానని మోసం చేశారు.

**చంద్రబాబు చేసిందేంటంటే..**

జన్మభూమి కమిటీల పేరుతో గ్రామాల్లో ఉన్న పెన్షన్లను తీసేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 18 ప్రభుత్వ స్కూళ్లను, 2 హాస్టళ్లను మూసేయించారు. నాలుగు మండలాలకు ఒక్కటే 108 అంబులెన్స్ తిరుగుతోంది. దానికి ఫోన్ చేస్తే కుయ్‌కుయ్ అంటూ 20 నిమిషాలకు రావాల్సిన అంబులెన్స్.. మండలానికి ఒక్కటి ఉండాల్సిన అంబులెన్స్ ఇవాళ నియోజకవర్గానికి ఒక్కటి ఉంది. కొత్త పరిశ్రమలు.. కొత్త ఉద్యోగాలు దేవుడెరుగు.. కానీ ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయి. ఒక్క రాజాంలోనే 17 పరిశ్రమలు మూతపడటంతో 20వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. చంద్రబాబు సీఎం కాగానే కరెంట్ చార్జీలు విపరీతంగా పెంచడంతో పరిశ్రమలు మూతపడ్డాయి. వైఎస్సార్ హయాంలో యూనిట్ చార్జ్ రూ. 3 ఉంటే ఇప్పుడు రూ. 8కి పెంచారు. కానీ చంద్రబాబు మాత్రం కొత్తగా 40 లక్షల ఉద్యోగాలు వచ్చాయని ఊదర గొడుతున్నారు. నీరు-చెట్టు పేరుతో అక్షరాల రూ. 20 కోట్ల దోపిడి జరిగింది. ఇసుక దోపిడితో పాటు మడ్డువలస వద్ద పాండవుల కొండను కబ్జా చేసి గ్రానైట్‌ను దోపిడీ చేస్తున్నారు. ఈ దోపిడిని అధికారులు అడ్డుకుంటే.. ఇక్కడి మంత్రి కళా వెంకట్రావ్ దగ్గరుండి వారిని బదిలీ చేయించారు. ఇదే నియోజకవర్గంలోని అగ్రిగోల్డ్ ఆస్తులను రక్షించాల్సిందిపోయి దోచేస్తున్నారు. షేర్ బ్రోకర్ పేరిట హిందీ ట్రేడ్ పేరు చెప్పి ఇదే నియోజకవర్గంలో 180 కోట్లు దోచేశారు. దాని దర్యాప్తును సీఐడీ చేస్తోంది. సీఐడీ అంటే.. అధికారంలో ఉన్న పెద్దల జోలికి పోదు. ఇంతవరకు దమ్మిడీ కూడా రాబట్టలేకపోయారు.

**తిత్లీ బాధితులకు ఆదుకున్నామని..**

తిత్లీ తుపాన్ బాధితులు చాలా ఆనందంగా ఉన్నారంటూ ఆర్టీసీ బస్సులపై చంద్రబాబు ఫొటోలతో ప్రచారం చేస్తారు. మొత్తం రూ. 3435 కోట్ల నష్టం వాటిల్లితే.. రూ. 520 కోట్లు మాత్రమే మంజూరు చేశారు. కనీసం 15 శాతం పరిహారం కూడా ఇవ్వని చంద్రబాబు ఇలా ప్రచారం చేసుకోవడం శవాల మీద చిల్లర ఏరుకోవడం కాదా? మరో నాలుగైదు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ఒక్కసారి ఎలాంటి నాయకుడు కావాలో గుండెలపై చేయి వేసుకుని ఆలోచించండి. చంద్రబాబు ఆనాడు చెప్పిన మాటలను గుర్తుతెచ్చుకోండని కోరుతున్నా. రుణమాఫీ పేరుతో రైతులు, మహిళలను మోసం చేశారు. ఆయన చేసిన రుణమాఫీ మోసం వడ్డీలకు సరిపోలేదు. అని ప్రజలకు వైఎస్ జగన్ వివరించారు. అధికారంలోకి రాగానే నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

# నా కృషితోనే భాగ్యనగరానికి అభివృద్ధి

కూడళ్లలో చంద్రబాబు మాట్లాడుతూ కేసీఆర్ పాలనపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రజల కోసం, రాష్ట్రం కోసం పోరాడిన వ్యక్తులు ప్రజాకూటమిలో ఉన్నారని చంద్రబాబు అన్నారు. తన హయాంలోనే హైదరాబాద్ చుట్టూ 165 కి.మీ పరిధిలో ఔటర్ రింగ్‌రోడ్డుకు శ్రీకారం చుట్టామని, మెట్రో రైలు ప్రాజెక్టు తన కృషి వల్లే మంజూరైందని చెప్పారు. ఒక విజన్‌తో హైదరాబాద్ అభివృద్ధికి కృషి చేశానని, దేశంలో ఏ నగరానికీ హైదరాబాద్‌తో పోలిక లేదన్నారు. ఓటమి భయంతో తెరాస మూడు మేనిఫెస్టోలు విడుదల చేసిందని చంద్రబాబు ఎద్దేవా చేశారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను కూడా కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని.. సీఎం కేసీఆర్, ప్రధాని మోదీ లాలూచీ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తానెప్పుడూ బెదిరింపు రాజకీయాలకు పాల్పడలేదని చెప్పారు. ఓ సీనియర్ నాయకుడిగా దేశంలోని పరిస్థితులను గాడిన పెట్టాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. నిరుద్యోగులకు రూ.3వేల భృతి, లక్ష ఉద్యోగాల భర్తీ తదితర హామీలన్నీ ప్రజాకూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని చంద్రబాబు వివరించారు.

# గద్వాలలో రాహుల్ గర్జన

సభలో రాహుల్ మాట్లాడారు. ఐదేళ్ల క్రితం తెలంగాణ ప్రజలు నీళ్లు, నిధులు, నియమాకాలపై కలలుగన్నారు. బంగారు తెలంగాణ కోసం స్వప్నించారు. ఆ కలలను కేసీఆర్ కూల్చివేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు విషయంలో మోసం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ రూ.10వేల కోట్లతో డీపీఆర్ చేస్తే.. తెరాస దాన్ని రీడిజైన్ పేరుతో రూ.60వేల కోట్లకు పెంచింది. కాంట్రాక్టులకు దోచిపెట్టారు. మేం అధికారంలోకి వస్తే పాలమూరు-రంగారెడ్డిని రెండు దశల్లో పూర్తి చేస్తాం. కేసీఆర్ అంటే.. కావో కమీషన్ రావ్ అని ఎద్దేవా చేశారు.

రాష్ట్రం వచ్చిన కొత్తలో ధనిక రాష్ట్రంగా ఉండేది. ఇప్పుడు అప్పుల పాలైంది. ప్రతి కుటుంబంపై ఇప్పుడు లక్ష రూపాయలు చొప్పున అప్పు ఉంది. అదే సమయంలో కేసీఆర్ కుటుంబంలో ఒక్కొక్కరూ రూ.400 కోట్లు చొప్పున వెనకేసుకున్నారు. తెలంగాణలో 30 లక్షలమంది ఉపాధి కోసం ఎదురుచూస్తుంటే.. గత నాలుగున్నరేళ్లలో ఎవరికైనా ఉద్యోగం కల్పించారా? లక్షల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా వారిని విద్యకు దూరం చేశారు. బంగారు తెలంగాణ అని మనం కలలు కంటే.. బంగారు కుటుంబం ఆవిర్భవించింది అని మండిపడ్డారు.

ఆదివాసీలు, రైతులను కేసీఆర్ మోసం చేశారు. ఎన్నికల్లో ఓడిపోతే విశ్రాంతి తీసుకుంటానని అంటున్నారు. ప్రజలకు మాత్రం ఇళ్లు ఇవ్వరా? ప్రజల బాధలనే పట్టించుకునే మనసే ఉంటే ఇళ్లు కట్టించి ఉండేవారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ కలను మేం నెరవేరుస్తాం. ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఇస్తాం. పింఛన్లు రద్దైన వారికి పునరుద్ధరిస్తాం. నిరుద్యోగులకు రూ.3వేలు భృతి ఇస్తాం. రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు విద్యకు కేటాయిస్తాం. ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షలతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెడతాం. ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇస్తాం అని రాహుల్ భరోసా ఇచ్చారు.

# ప్రజాభీష్టమే గెలవాలి

స్పష్టం చేశారు. సోమవారం కోదాడలో జరిగిన ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. చిల్లర మాటలు, అబద్ధాలతో గత 70 ఏళ్లుగా దేశ రాజకీయ వ్యవస్థ నలిగిపోతోంది.. దేశంలోని ప్రజల ఆశలు తీరడంలేదు. రైతుల ఆత్మహత్యలు ఆగడంలేదు. దేశంలో నీళ్లు ఉండీ తెలివి లేక గత పాలకులు ప్రజలకు మంచినీరు ఇవ్వలేకపోయారు. ఎన్నికల్లో గెలవాల్సింది నాయకులు కాదు, ప్రజల అభీష్టమే గెలవాలి. తెలంగాణలో విద్యుత్ సమస్యను పరిష్కరించాం. నేడు దేశంలో అత్యధికంగా విద్యుత్ వినియోగించుకుంటున్న రాష్ట్రం తెలంగాణ . భాజపా, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమ కార్యక్రమాలు అంతంత మాత్రమేనని కేసీఆర్ చెప్పారు.

# 4.93 లక్షల బోగస్ ఓట్లు తొలగించాం

చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే అభ్యర్థుల క్రిమినల్ రికార్డులను సేకరించామని, పార్టీల మేనిఫెస్టోలు, హామీలను పరిశీలిస్తున్నామని రజత్‌కుమార్ చెప్పారు.

# ఏపీలో పది పరీక్షల షెడ్యూల్ విడుదల

పరీక్షలు జరిగిన నెల రోజులకే ఫలితాలను విడుదల చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. ఇప్పటికే ఆంగ్ల మాధ్యమంలో బోధన అందిస్తున్నామని తెలిపారు.

# ఉద్యమంలో సెంటిమెంట్.. అధికారంలో సెటిల్‌మెంట్

## ఇదేంటని అడిగితే మాకు పనిష్మెంటా? .. తెరాస గద్దె దిగడం ఖాయం

## కాంగ్రెస్ ప్రచార తార విజయశాంతి

పెద్దపల్లి: తెలంగాణను పరిపాలించడం సీఎం కేసీఆర్‌కు చేతకాదని కాంగ్రెస్ ప్రచార తార విజయశాంతి విమర్శించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయ రమణారావుకు మద్దతుగా ఆమె సోమవారం సుల్తానాబాద్‌లో ఎన్నికల ప్రచార రోడ్‌షోలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేసీఆర్ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డిసెంబర్ 7న జరిగే ఎన్నికల్లో తెరాస గద్దె దిగడం ఖాయమని, కేసీఆర్‌కు రాములమ్మ చెబుతోన్న జాతకమిదేనన్నారు.

తెలంగాణ తలరాత మారబోతోందని, నాడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలేంటి? ఈనాడు చేస్తోన్న మోసమేంటని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని తెరాసను గద్దె దింపాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

తెలంగాణ ఉద్యమం సందర్భంలో సెంటిమెంట్, అధికారంలోకి వచ్చాక సెటిల్‌మెంట్.. తెలంగాణను వ్యతిరేకించిన ద్రోహులకు మంత్రివర్గంలో ప్లేస్‌మెంట్.. ఇదేంటని అడిగితే తమకు పనిష్మెంట్.. అంటూ కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు.

మరోసారి తెరాసకు ఓటేస్తే ప్రజల జీవితాలు నాశనమవుతాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించిన విజయశాంతి.. ప్రజాకూటమిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏ పథకమూ ఆగిపోదని స్పష్టంచేశారు.

# గెడ్డలపనులను సత్వరం పూర్తి చేయండి

రూ.7.94 కోట్లతో నాలుగు గెడ్డల అభివృద్ధి .. ఊటగెడ్డ, చినవాల్తేర్, కిర్లంపూడి, మైత్రినగర్ గెడ్డల అభివృద్ధి

పాండురంగాపురం-మైత్రినగర్ గెడ్డ పనులు పరిశీలన .. సంతృప్తి వ్యక్తం చేసిన జివిఎంసి కమిషనర్



విశాఖపట్నం: గెడ్డల పనులను సత్వరం పూర్తి చేయాలని జివియంసి కమిషనర్ హరి నారాయణన్ పేర్కోన్నారు. క్షేత్రపర్యటనలో భాగంగా పాండురంగాపురం-మైత్రినగర్‌లో నిర్వహిస్తున్న గెడ్డ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.7.94 కోట్లతో నాలుగు గెడ్డలు ఊటగెడ్డ, చినవాల్తేర్, కిర్లంపూడి, మైత్రినగర్ గెడ్డలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కోన్నారు. గెడ్డ పనులు పరిశీలించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యటనలో యస్.ఇ వినయ్‌కుమార్, ఇ.ఇ శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.

# అన్నసమారాధన ప్రారంభించిన సీతారాం





అనకాపల్లి : మండలంలోని బిఆర్టీ కాలనీలో కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం ప్రారంభించారు.దానికి ముందుగా ఆయన గౌరీపరమేశ్వరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే పట్టణంలోని చినరాజుపేటలో శూలాల మహోత్సవాన్ని పురస్కరించుకుని చౌడేశ్వరి సాంబమూర్తులను దర్శించుకున్నారు.అంతే కాకుండా కూరగాయల మార్కెట్ వద్ద గల శివాలయం ఆవరణలో జరిగిన సామూహిక రుద్రాభిషేకం కార్యక్రమానికి కూడా ముఖ్య అతిధిగా హాజరై స్వామివారికి అభిషేకం నిర్వహించారు.

# జనసేన పార్టీ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం

భీమునిపట్నం : జనసేన పార్టీ భీమిలీ నియోజకవర్గ జిల్లా నాయకులకు మరియు సమన్వయ కమిటీ సభ్యుల కీలక సమావేశం తగరపువలస జరిగింది. గత కొన్ని నెలలగా పార్టీని ప్రజల్లోకి తీసుకుని వెళ్లిన తీరు, స్పందన మరియు ఆయా ప్రాంతాల్లో సమస్యలను నియోజకవర్గ నాయకులు ఆలీవర్ రాయి నేతృత్వంలో విశ్లేషించారు. ప్రప్రథమంగా అనేక గ్రామాల్లో జన్మభూమి కమిటీ సభ్యుల దురుసు ప్రవర్తన అలాగే డ్వాక్రా మహిళలకు బెదిరింపులు, వృద్దులకు పెన్షన్ నిలేపేస్తాం అనే ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయని నియోజకవర్గ నాయకులు ఆలీవర్ రాయి కి పలువురు తెలిపారు దీనిపై ఆయన స్పందించి అటువంటి సంఘటనలు ఏవైనా ఉంటే తప్పని సరిగా ఆ ప్రాంతంలో తక్షణమే నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని అన్నారు. పాలకులు అధికార దుర్విని యోగం చేస్తున్నారని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకి వ్యతిరేకం అని రాయి అన్నారు. పార్టీని భీమిలీ నియోజకవర్గంలో ఇంకా బలోపేతం చేయుటకు గాను కార్యాచరణ రూపొందించారు. బూత్ కమిటీ లు ఇప్పటికే ఉన్నందున, వాటి సభ్యులతో త్వరలో మండలాల వారిగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే సర్పంచ్ ఎన్నికలు జనవరిలో నిర్వహిస్తే జనసేన సత్తా పిస్తామన్నారు. ఇప్పటికే అనేక పార్టీలనుండి మాజీ సర్పంచులు అనేకమంది తమను సంప్రదిస్తున్నారని ,సమయం వచ్చినప్పుడు వారందరూ జనసేనలోకి రావడానికి సిద్ధముగా ఉన్నారు అని రాయి వెల్లడించారు. జనసేన పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం కూడా జోరుగా సాగుతోందని ఇప్పటికే 20 వేల పైబడి నమోదు అవ్వడం



ఎంతో గర్వకారణం అన్నారు. రానున్న రోజుల్లో 50వేల సభ్యత్వ టార్గెట్ ని ఛేదించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బివి కృష్ణయ్య, ఈశ్వర్, శ్రీకాంత్ తో పాటు సమన్వయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానంద సరస్వతి చేతులమీదుగా

# అప్పన్న నృసింహదీక్షలు ప్రారంభం

సింహాచలం : శ్రీ సింహాద్రి అప్పన్న నృసింహదీక్షలు శ్రీ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానంద సరస్వతి ముఖ్య అతిధిగా సోమవారం నాడు ప్రారంభమయ్యాయి ముందుగా సింహగిరికి చేరుకున్న స్వామిజీ వారికి ఆలయ అధికారులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగత ఏర్పాట్లు చేయగా అంతరాలయంలో స్వామిజీ పేరున ప్రత్యేక అర్చనలు చేయగా బేడా మండపంలో స్వామిజీ వారికి అప్పన్న చిత్రపటం ప్రసాదములు అందజేశారు అనంతరం స్వామిజీ నృసింహ మండపమునకు చేరుకొని ప్రత్యేకము గా ఏర్పాటుచేసిన మండపం నందు దీక్ష స్వీకరించేవారికి మాలధారణ చేశారు 40 రోజులపాటు అత్యంత నియమనిష్టలతో స్వామిని పూజించి చేపట్టే ఈ దీక్ష జనవరి 13 తో పూర్ణాహుతి తో ఈ దీక్షలు ముగియనున్నాయి ఇందుకు సంబంధించి జిల్లా నలుమూలలనుంచి వివిధ గిరిజన ప్రాంతాలనుంచి విచ్చేసిన సుమారు ఏడువందలమంది భక్తులు సింహగిరికి చేరుకోగా దీక్ష స్వీకరించు భక్తులకు రాజగోపురం ఎదురుగా గల నృసింహ మండపంలో శ్రీ పరిపూర్ణానంద సరస్వతి స్వామి గారి స్వహస్తాలతో వారికి మాలధారణ చేశారు దీక్షలు ప్రారంభం నేపథ్యంలో నృసింహాదీక్ష దారులతో సింహగిరి అంతా



హరినామస్మరణతో మారుమ్రోగిపోయింది ఈ కార్యక్రమంలో స్వామిజీ వెంట కిరణ్ స్వామి ఇతర శిష్యబృందం పాల్గొనగా సింహాచలం దేవస్థానం ఈ ఓ కె .రామచంద్రమోహన్ అర్చక స్వాములు ఇతర దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు

# విపత్తులపై 10,11 తేదీలో గీతం, టోక్యో వర్సిటీల కార్యశాల

## జిల్లా అధికారులతో నిపుణుల సమావేశం

సాగర్‌నగర్‌: తుపానులు, భూకంపాలు, వరదల వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎదురయిన సందర్భంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ముందుగా అప్రమత్తం అయి నష్ట తీవ్రతను తగ్గించడానికి గల ప్రణాళికలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, జపాన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టోక్యోకు చెందిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ సయుక్తంగా డిసెంబర్ 10,11 తేదీలలో అంతర్జాతీయ కార్యశాలను నిర్వహిస్తున్నాయి. దీనికి సంబందించిన వివరాలతో కూడిన బ్రోచర్‌ను సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు, ఆవిష్కరించారు. విపత్తులను ఎదుర్కోవడం పై సాంకేతిక సహకారాన్ని, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న అధ్యయనాలను ఈ విధంగా ఉమ్మడి వేదికపై చర్చించడానికి ముందుకు రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రధానంగా డిజాస్టర్ మిటి గేషన్, ఫ్లడ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అనే అంశాలపై టోక్యో యూనివర్సిటీ నిపుణులు ప్రసంగిస్తారని, నేపాల్‌లో డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ పై అక్కడి నిర్వహణ కేంద్రం అధికారులు ప్రసం గిస్తారని కార్యశాల కన్వీనర్ తెలిపారు. కార్యక్రమంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్.పోతరాజు,ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ కె.వి.రమేష్, ప్రొఫెసర్ కె.వీరభద్రం, ప్రొఫెసర్ రమేష్ పాల్గొన్నారు.

***జిల్లా అధికారులతో సమావేశం:***

ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవలసి జాగ్రత్తలు , ప్రస్తుతం అమలవుతున్న విపత్తు నిర్వహణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ విభాగం అధికారులతో నిపుణుల బృందం సమావేశం అవుతుంది.

అలాగే ఆకర్షణీయ నగరాలలో విపత్తుల నిర్వహణకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై విశాఖ నగరపాలక సంస్థ అధికారులతో నిపుణులు సమావేశం అవుతారు.

# గీతంలో భారత నౌకాదళం ప్రాంగణ నియామకాలు

## విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన



సాగర్‌నగర్‌: భారత నౌకాదళంలో యువతకు అవకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో చేపట్టిన యూనివర్శిటీ ఎంట్రీ స్కీమ్ (యుఇఎస్) కు సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థుల నుంచి అనుహ్య స్పందన లభించింది. తూర్పు నౌకాదళం నియామకపు బృందం చేపట్టిన స్పెషల్‌డ్రైవ్‌కు ఇంజనీరింగ్ విభాగాల నుంచి దాదాపు 160 మంది విద్యార్థులు హజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన కమాండ్ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్ కెప్టెన్ ఎస్.సి.దాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో గల కళాశాలలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించిన తమకు గీతం నుంచి ఇంత పెద్ద సంఖ్యలో నౌకాదళ ప్రవేశాలకు విద్యార్థులు ఆసక్తి చూపడం ఆనందం కలిగించిందన్నారు.

ఆఫీసర్స్ ఇంటిలిజెన్స్ రేటింగ్ (ఓఐఆర్) సహ నౌకాదళంలో ఎంపికలు జరిగే తీరును ఆయన వివరించారు. గౌరవ ప్రధమైన జీవితం, దేశభక్తి, ఉన్నత వ్యక్తిత్వం, శారీరక ధారుడ్యంతో ఉండే యువతరం సేవలు దేశ నౌకా దళానికి అవసరమని తెలిపారు.ఆంగ్ల భాషలో చక్కగా భావ వ్యక్తీకరణ చేయడం,బృంద చర్చలలో అభిప్రాయాలను తెలియజెప్పడంతో పాటు శారీరకంగా ఫిట్‌నెస్‌తో ఉండేవారు త్వరగా నౌకాదళంలోకి ప్రవేశించగలుగుతారని ఆయన తెలిపారు.

ఇంటర్వ్యూ చేసే నేవీ ఆధికారులు విద్యార్థులతో స్నేహ పూర్వకంగా మెలిగేలా శిక్షణ పొందారని తెలిపారు. భారత నౌకాదళంలో ప్రవేశించే వారికి లభించే వేతనం, సధుపాయాలు, వివిధ ర్యాంకులను ఆయన వివరించారు. ఎంపిక చేసిన విద్యార్థులకు 2019 జనవరిలో సర్వీసెస్ సెలక్షన్ బోర్డు ద్వారా సమాచారాన్ని తెలియజేస్తామన్నారు.

కార్యక్రమంలో గీతం ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ విభాగం అధికారులు, నేవీ రిక్రూట్‌మెంట్ విభాగం స్క్రీనింగ్ బోర్డు అధికారులు హజరయ్యారు.

# మీ కోసం (ప్రజావాణి 296 దరఖాస్తులు)



విశాఖపట్నం : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం (ప్రజావాణి) కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ వినతులను అధికారులకు సమర్పించారు. సోమవారం మీ కోసం కార్యక్రమానికి 296 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ -2 డా.సిరి, డిఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, పలు ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి స్వయంగా వినతులను స్వీకరించారు. గృహాలు, రేషన్‌కార్డులు, భూమి వివాదాలు, పింఛన్ల మంజూరు మరియు ఇతర సమస్యలకు సంబంధించిన విజ్ఞాపనలను సమర్పించారు. మీ కోసం కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అదేవిధంగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో భాగంగా 14 ఫోన్ కాల్స్ వచ్చాయి. జాయింట్ కలెక్టర్-2 డా.సిరి ఫోన్‌కాల్స్‌లో ఫిర్యాదుదారుల నుండి వినతులను స్వీకరించారు. తద్వారా సమస్యల పరిష్కార నిమిత్తం సంబంధిత అధికారులను ఆదేశించారు.

# విజయసాయి రెడ్డికి ఘనస్వాగతం పలికిన కొండా రాజీవ్ గాంధీ



**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణా వ్యవహారాల ఇంచార్జ్, విశాఖ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ అయినటువంటి వేణుంబాక విజయసాయిరెడ్డి సోమవారం విశాఖ విచ్చేసిన సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం యువజన అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో నగర పార్టీ అధ్యక్షులు మల్ల విజయప్రసాద్ పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు తైనాల విజయ్ కుమార్‌ల సమక్షంలో విజయ్ సాయి రెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా స్వాగతం పలికారు.**

# ముగిసిన రాష్ట్ర స్థాయి సిఎం కప్ ఫుట్ బాల్ పోటీలు



భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖపట్నం ఆద్వర్యంలో 64 వ సి.ఎం.కప్ అండర్ 17 బాల బాలికల ఫుట్ బాల్ పోటీలు ఆదివారం సాయత్రం తో ముగిసాయి.ఈ పోటిల్లో బాలురు విబాగం లో విన్నర్స్ గా విశాఖపట్నం జట్టు రన్నర్స్ గా కర్నూలు జట్టులు గెలుపొందాయి . అలాగే బాలికల విబాగంలో విన్నర్స్ గా నెల్లూరు జట్టు,రన్నర్స్ గా గెలుపొందాయి. విజేతలకు నమ్మివానిపేట అమేయ వరల్డ్ స్కూల్ జరిగిన ముగింపు కార్యక్రమంకు ముఖ్య అతిదిగా విచ్చేసిన రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు ట్రోపిలను అందజేసారు. ఈసందర్భంగా మంత్రి వర్యులు గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడారంగం అభివృద్ధి కి ప్రభుత్వం సముచిత స్థానం కలిపిస్తున్నట్టు తెలిపారు.జాతీయ అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగాలని అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రీడలకు అత్యదికంగా నిదులు కేటాయస్తూ క్రీడాకారులను ప్రోత్సాహం ఇస్తున్నారని .ఇటీవల రాష్టంలోని 240 మంది ప్రతిభగల క్రీడాకారులకు అమరావతి లో క్రీడా ప్రత్యేక అవార్డులు బహుకరించామని ఒక్కరికి రెండువేలు నగదు ప్రోత్సాహక బహుమతి ట్యాబ్ లు అందిచామని. .అగనం పూడిలో 150 ఎకరాల్లో 300 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని విద్యార్దులకు అకాడమిక్ ఎడ్యుకేషన్ తో పాటు ఏదో ఒక గోల్ పెట్టుకోవాలని అన్నారు. ఈ నెలలో శ్రీనగర్‌లో జరిగే జాతీయ ఫుట్ బాల్ పోటిలలో కూడా నై పుణ్యమును ప్రదర్శించి విజేతలు గా నిలవాలని ఆయన కోరారు. 13 జిల్లా నుంచి వచ్చిన క్రీడా కారుల లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన 18 మంది బాలురు 18 మంది బాలికలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్ బాల్ జట్టుకు ఎంపిక చేసి ఈ నెలలో శ్రీనగర్ జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపనున్నట్లు . ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అర్గ నైజింగ్ సెక్రెటరీ లలిత్ కుమార్, లియాకత్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అద్యక్షులు హర్షవర్దన్ ప్రసాద్,ఉపాద్యక్షులు సురేష్ కుమార్, డి.ఇ.ఓ లింగేశ్వర రెడ్డి, నియోజక వర్గ ఇన్ చార్జ్ చిక్కాల విజయబాబు, భీమిలి డివిజన్ టి.డి.పి అద్యక్షులు గంటా నూకరాజు, ఎం.ఇ.ఓ కె.ఎ.బాలమణి, అమేయ వరల్డ్ స్కూల్ డైరెక్టర్ తులసి ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కొనసాగుతున్న మహాసౌరయాగం



అనకాపల్లి : పట్టణంలో డీసిఎంఎస్‌లో ఆదివారం నుండి ప్రారంభమైన మహాసౌరయాగం అత్యంత వైభవంగా కొనసాగుతుంది. చినముషిడివాడ శారదా పీఠాదిపతి స్వరూపానంద సరస్వతి ఈ యాగాన్ని ప్రారంభించారు. రేజేటి రామాచార్యులు ఆద్వర్యంలో సంపూర్ణ మంగళశాసనాలతో శ్రీ విష్ణు పంచాయతన సహిత మహా సౌరయాగానికి పట్టణ ప్రజల నుండి అనూహ్యస్పందన లభిస్తుంది.

14 వరకు జరిగే ఈ యాగంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. విశిష్ట అతిధిగా విమాలయ సంత్ వేదానంద బాబాకి పాల్గొన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తదితరులు ముఖ్య అతిధు లుగా పాల్గొని, యాగంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో డిసిఎంఎస్ ప్రాంగణం కిటకిట లాడింది. వేదపండితుల మంత్రోఛ్చరణలు మంగళ వాయి ద్యాలు నడుమ ఆ ప్రాంతమంతా ఆద్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంది.

విజయభాను

సంపాదకీయం

# మిథాలీ వివాదం

సుప్రీంకోర్టు నిరంతరం ఒత్తిడి పెట్టి ప్రక్షాళన చేపట్టినా, క్రికెట్ క్రీడారంగం ఇంకా చక్కబడలేదని తాజాగా మిథాలీ కేంద్రంగా చెలరేగుతున్న వివాదం సూచిస్తున్నది. మహిళా జట్టులో చెప్పుకోదగిన ఆటగాళ్ళంటూ లేనప్పుడు, తనంత తాను ఎదిగివచ్చిన ఘనత మిథాలీది. మహి ళా క్రికెట్ కూడా ఒకటి ఉందనే విధంగా తన ఆటద్వారా గుర్తింపు తెచ్చిన విలక్షణ క్రీడాకారిణి మిథాలీ. ఇప్పటికీ ఆమె ఫామ్‌లో ఉన్నదనేది నిర్వివాదాంశం. మరి ఆమెను ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌కు తుది జట్టులో చోటు నిరాకరించడమేమిటనేదే ఆశ్చర్యకరం. పోనీ ఆమెను పక్కన పెట్టి జట్టు చక్కగా ఆడిందా అంటే అదీ లేదు. ఘోర పరాజయం పాలైంది. ఆమెను జట్టు నుంచి తప్పించినప్పుడు మాటమాత్రంగానైనా ఆమెతో చెప్పారా అంటే అదీ లేదు. మిథాలీరాజ్‌ను పక్కనపెట్టడం సాధారణంగా జరిగింది కాదని, అందులో కక్ష సాధింపు ఉన్నదనేది స్పష్టం. గతంలో భారత జట్టుకు గ్రెగ్ చాపెల్ కోచ్‌గా ఉన్నప్పుడు కూడా సౌరవ్ గంగూలీ వంటి ప్రముఖ క్రీడాకారుడికి అవకాశం కోల్పోవలసిన దుస్థితి ఏర్పడ్డది. ఈ వివాదం పశ్చిమ బెంగాల్‌లో ప్రదర్శనలు మొదలుకొని పార్లమెంట్‌లో చర్చదాకా వెళ్ళింది. ఇప్పుడు మిథాలీ రాజ్‌కున్న పేరు ప్రతిష్ఠల మూలంగా ఆమెకు జరిగిన అన్యాయం చర్చానీయాంశమైంది. కానీ సాధారణ ఆటగాళ్ళ పరిస్థితేమిటి? మిథాలీరాజ్‌ను తప్పించిన ఉదంతం వివాదంగా మారగానే, రెండు శిబిరాలు పరస్పరం బురద జల్లుకునే పనికి దిగాయి. పత్రికలలో కథనాలు రాయించుకోవడం, విమర్శలకు దిగడం వల్ల ఇరుపక్షాల ప్రతిష్ఠ మరింత దిగజారిందే తప్ప ఒరిగిందేమీ లేదు. ఈ వివాదంలో ఎవరి పాత్ర ఎంత అయినప్పటికీ, మిథాలీకి అన్యాయం జరిగిందనేది స్పష్టం. దీనిపై ఆమె ఆవేదన చెందడం సహజం. ఇరువై ఏండ్ల నా సుదీర్ఘ కెరీర్‌లో తొలిసారి కుంగిపోయా, ఆత్మవిశ్వాసం కోల్పోయాను. నన్ను నాశనం చేయాలని, నా ఆత్మవిశ్వాసంపై దెబ్బకొట్టాలని చూస్తున్నారు. ఆట పట్ల నాకున్న నిబద్ధత, క్రికెట్ కోసం నేను పడిన కష్టం, చిందించిన చెమట, శ్రమ అన్నీ వృథా. చివరకు ఈవేళ నా దేశభక్తినే శంకిస్తున్నారు. ఆటలో నా నైపుణ్యాన్ని ప్రశ్నిస్తూ బురద జల్లుతున్నారు అని మిథాలీరాజ్ భావోద్వేగంతో ట్వీట్ చేసింది. గాయం కారణంగా ఆసీస్‌తో మ్యాచ్ నుంచి మిథా లీ తప్పుకోగా, ఆ మ్యాచ్‌లో విజయం సాధించిన కూర్పునే సెమీస్ మ్యాచ్‌లో కొనసాగించామని కెప్టె న్ హర్మన్‌ప్రీత్ చెప్పుకోవడం సమంజసంగా లేదు. మిథాలీ ఆటతీరు బాగా లేదంటూ చేస్తున్న వాదనలు కూడా వాస్తవం కాదు. ఆమె రికార్డుల కోస మే ఆలోచిస్తారని, తనను ఓపెనింగ్‌లో పెట్టాలని డిమాండ్ చేస్తారని, బెదిరిస్తుంటారని జట్టు కోచ్ రమేశ్ పొవార్ ఆరోపిస్తున్నారు. కాగా పొవార్ కొంతకాలంగా తన పట్ల అవమానకరంగా వ్యవహరిస్తుట్టు మిథాలీ ఆరోపిస్తున్నారు. వివాదం మరింత ముదురుతుండగా బీసీసీఐ రంగంలోకి దిగింది. కానీ సమస్యను ఎట్లా పరిష్కరిస్తుందో చూడాలె. క్రీడాకారులు కౌమార వయస్కులు లేదా యువజనులై ఉంటారు, ఉత్సాహం ఉరకలు వేస్తుంటుంది. ఈ దశలో క్రీడారంగంలోని అనారోగ్యకర పోకడలు వారిని నిరాశపరిస్తే క్రీడా నైపుణ్యం దెబ్బతింటుంది. ప్రతిభావంతులు పైకి ఎదుగలేరు. స్వాభిమానంతో ఉన్న వారు పై అధికారులను మెప్పించలేకపోవచ్చు. క్రీడాధికారులు తమ విధేయులుగా ఉన్నవారిని మాత్రమే ఎదుగనిస్తూ, మిగతావారిని అణిచివేస్తే మొత్తం క్రీడారంగమే దెబ్బతింటుంది. క్రీడాకారులు వయసులో ఉంటారు. వారికి అంతగా పరిణత వ్యక్తిత్వం ఉండకపోవచ్చు. క్రీడాకారులుగా వచ్చిన గుర్తింపు వారిలో కొంత అహంకారాన్ని పెంచవచ్చు, కోచ్‌లు, అధికారుల పట్ల పట్టింపు లేకుండా వ్యవహరించవచ్చు. ఇటువంటి సందర్భంలో వారితో ఎట్లా వ్యవహరించాలనే విషయమై అధికారులకు అవగాహన ఉండాలె. వారి అభిమానం దెబ్బతీయకుండానే ఔన్నత్యం అలవరుచుకోవడం వారికి నేర్పాలె. అధికారులు కూడా క్రీడాకారుల స్థాయికి దిగి కక్షగట్టి వేధించకూడదు. క్రీడాకారులను తయారుచేయడమంటే, కోచ్‌ను ఇచ్చి శిక్షణ ఇవ్వడమో, ఆదాయం పెంచడమో కాదు. సంస్కారవంతమైన క్రీడా సంస్కృతిని నెలకొల్పాలె. మిథిలారాజ్ వ్యవహా రం ఏదో రకంగా సర్దుబాటు చేయవచ్చు. ఇప్పటికే ఎంతో ప్రతిష్ఠను మూటగట్టుకొని ఉన్నందు వల్ల ఆమెకు అన్యాయం జరుగకపోవచ్చు. కానీ క్రీడారంగంలో ఇటువంటి కుత్సిత వ్యవహార సరళి ఉంటే కింది నించి పై వరకు ఎదగవలసిన క్రీడాకారుల గతేమిటి? అందువల్ల సమస్యలు తలెత్తినప్పుడల్లా సర్దుబాటు చేసి చేతులు దులుపుకోకూడదు. క్రీడారంగంలో పేరుకుపోయిన ముఠాలు, కక్షసాధింపుల కుసంస్కృతిని నిర్మూలించి, కొత్త ప్రజాస్వామిక సంస్కృతిని నెలకొల్పాలె.

# పేదలకు సహాయసహకారాలు చేయడం గొప్పవరం

భీమునిపట్నం : పేదలకు సహాయం చేయడం అనేది చాలా గొప్ప విషయమని తగరపువలస మణికంఠ స్వీట్ షాప్ యజమానులు తల్లి ఆదిమూలం రమణమ్మ అన్నారు. మణికంఠ స్వీట్స్ 24వవార్షికోత్సవం సందర్భంగా వుయ్ కేర్ యు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీలో ఉన్న రెండు పేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు కనడం ఒక ఆనందం అయితే వారు పెరిగి పెద్దవాళ్ళు అయి మంచి కార్యక్రమాలు చెయడం మరింత ఆనందం ఇస్తుందని అన్నారు. ఇలాగె ఇంకా మరింత మంచి కార్యక్రమాలు చెయాలని ఆభగవంతుని ప్రార్థిస్తున్నాని ఆమె తెలిపారు.

అంతే కాకుండా వుయ్ కేర్ యు సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు . ఈకార్యక్రమంలో సంస్థ ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాస్ రెడ్డి, వుయ్ కేర్ యు సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భీమిలి డివిజన్ ఉపాధ్యక్షులు పుట్టినరోజు వేడుకలు



భీమునిపట్నం : భీమిలి డివిజన్ ఉపాధ్యక్షులు పెంటపల్లి యోగి పుట్టినరోజు వేడుకలు భీమిలి డివిజన్ టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు వేడుకలు స్థానిక గంటా క్యాంపు కార్యాలయంలో టీడీపీ అధ్యక్షులు గంటానూకరాజు, కార్యదర్శి గొలగాని నరేంద్ర కుమార్ మరియు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి గజమాలతో సత్కరించారు.అనంతరం యోగి కేక్ కట్ చేసి నాయుకులకు కార్యకర్తలకు స్వీట్స్ కేక్ పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, చురకల రమణ, మారోజు సంజీవ్ కుమార్, గిడుతూరి శ్రీనివాస రావు, కనకల అప్పలనాయుడు ఊళ్ళ దుర్గారావు, కొక్కిరి అప్పన్న, సత్యారావు, కె కామేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఇళ్ల కేటాయింపులు

## మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్



విజయనగరం : హౌస్ ఫర్ ఆల్ పథకంలో లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా జరిగిందని మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్ తెలియజేశారు. సోమవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని ఆధారాలతో దరఖాస్తులు చేసుకున్న వారికే హౌస్ ఫర్ ఆల్ పథకంలో ఇళ్లు మంజూరు, కేటాయింపులు చేసామన్నారు. స్థానికేతరులకు ఇళ్లకేటాయింపులు జరగలేదన్నారు. అన్నింటా పారదర్శకంగా వ్యవహరించామన్నారు. అప్లికేషన్లు అన్నీ ఆన్‌లైన్‌ద్వారానే స్వీకరించడం జరిగిందన్నారు. ఆఫ్‌లైన్‌లో ఒక్కదరఖాస్తు కూడా స్వీకరించలేదన్నారు. సోషల్ ఆడిట్ బృందం అవగాహన లోపంతో వ్యవహరించారన్నారు. ఆన్‌లైన్ ద్వారా 15400 అప్లికేషన్లు వచ్చాయని, వాటిలో 4060 లబ్ధిదారు లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. సారిపల్లి వద్ద ఇప్పటికే 2730 మందికి ఇళ్లను కేటాయించడం జరిగిందన్నారు. మిగిలినవారికి సోనియా నగర్ వద్ద ఇళ్లను కేటాయిస్తామన్నారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న వారిని మాత్రమే పరిగణలోనికి తీసుకున్నామన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను 46 బృందాలు ద్వారా సర్వే చేసి అర్హులను మాత్రమే పరిగణలోనికి తీసుకోవడం జరిగిందన్నారు. సర్వే బృందాలు అర్హత ఉందని లిఖిత పూర్వకంగా అందజేసిన జాబితానే పరిగణలోనికి తీసు కున్నామన్నారు. ఎక్కడైనా ఒకటిరెండు చోట్ల పొరపాటు జరిగివుంటే, దానిని మాదృష్టికి తీసుకునివస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సోషల్ ఆడిట్ బృందానికి ఎవరూ కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయలేదన్నారు. సోషల్ ఆడిట్ బృందానికి కొంతమంది రాజకీయాల కారణాలతో నిరాధార ఆరోపణలతో అవాస్తవ సమాచారం ఇచ్చే అవకాశం కూడా ఉందన్నారు. లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదులను మాత్రమే పరిగణలోనికి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హౌస్ ఫర్ ఆల్ చాలా మంచిపథకమన్నారు. ఏదో జరిగిపోయిందనే అపోహను విడనాడాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో టిడ్కో ప్రతినిధి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఈనెల 13వ తేదీన

# తిరుపతిలో పారిశ్రామిక సదస్సు : జి.ఎం. ఉదయభాస్కర్




విజయనగరం: ఈనెల 13వ తేదీన తిరుపతిలో నిర్వహించే సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు సదస్సుకు జిల్లా పారిశ్రామిక వేత్తలు హాజరుకావలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం.ఉదయ భాస్కర్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా పరిశ్రమల కేంద్రంలో పరిశ్రమల స్థాపనకు అనుకూలతపై జరిగిన సదస్సులో ప్రాజక్టులు, అనుమతులు, ప్రాంతాల వారీగా ఏఏ పరిశ్రమలు స్థాపించగలమో వివరించారు. సమకాలలీన పరిస్థిలులు, ఉత్పత్తులపై అవగాహన సదస్సులో వివరిస్తారని తెలిపారు. అలాగే ఉచిత బస్సు సౌకర్యం, భోజనం, వసతి కూడా కల్పిస్తారని తెలిపారు. ఎపిఐఐసి మేనేజర్ ఎం.వి.కరుణాకర్ మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయదలచిన ఎంఎస్ఎంఇ పార్కుల వివరాలు తెలిపారు. ఈ మేరకు దరఖాస్తులు చేసుకుంటే పరిశీలన అనంతరం భూమిని అలాట్ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక సంస్థ బ్రాంచ్ మేనేజర్ బి.శేషగిరిరావు మాట్లాడుతూ ఋణపథకాలు, పారిశ్రామికులకు ఇతోధికంగా ఉపయోగపడు యస్.పథకం పై వివరించారు.

ఈ అవగాహన సదస్సులో సంస్థ సీనియర్ మేనేజర్ ఎ.ఎస్.వెంకటరావు, లీడ్‌బాంకు మేనేజర్ టి.గురువయ్య, అధికారులు, పారిశ్రామిక వేత్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కవి సమయం

# జీవితం - ఒక గమ్యం

జీవితం ఒక గమ్యం రా...
నడచిన కొలచి యెక్కువరా...
పరుగులు దీసే పయనంరా...
వెళ్ళిన కొలది యెంతోరా...
అడవులలో మానవులున్నా...
కొండల్లో నివసిస్తున్నా...
కాలం మానవ జీవనరా...
నడవడి మానవధర్మమురా...
బతికుంటే బలుసాకన్నారు పెద్దలు
అలగనీ...
లక్ష్య సాధన కాదంటామా?
కడలి ప్రయాణం మానేస్తామా?
గాలివోడలు వద్దంటామా?
శత్రువు నెదిరిస్తాము సరిహద్దుల్లో...
మనిషికి నడుపును జ్ఞానం రా...
మానవా.... నీ... మహనియ్యతినీ...
ఆరోగ్యం మనిషికిరా...
ముసలితనం కాదురా...
మహాభాగ్యంగా...
మోయుమురా...

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

# పంచాంగం

మాసం : కార్తీక; తిథి : ద్వాదశి మ.12.56; స్వాతి రా.తె.4.00; ఉ.వ.9.9ల 11.24.

మంగళవారం 04-12-2018

a **మేషం** : సామాజిక కార్య క్రమాల పట్ల ఆసక్తితో వ్యవహరిస్తారు. కళ, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. క్రీడలు, పోటీల్లో రాణిస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెంచుకుంటారు. రాజకీయ వ్యక్తులకు చికాకులు తప్పవు. b **వృషభం** : నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. స్పెక్యులేషన్ కలిసివచ్చును. మీ లక్ష్యసాధనకు ప్రముఖులు, ప్రభుత్వ అధికారుల సహకారం అందుతుంది. ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. అవివా హితులకు అనుకూలం. కొత్త పరిచ యాలు ఏర్పడతాయి. c **మిథునం** : ఇతరులపై ఆధారపడక స్వశక్తితోనే మీ పనులు పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యంపై దృష్టి సారిస్తారు. వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత వహించండి. ఆత్మీయులకు ఒక ముఖ్య సమాచారం అందించడం వల్ల మీ గౌరవ ప్రతిష్టలు ఇనుమడిస్తాయి.e **కర్కాటకం** : వైద్య రంగంలో వారికి శ్రేయస్కరం. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. విద్యార్థులలో నూతనోత్సాహం చోటు చేసు కుంటుంది. వాహన యోగం పొందుతారు. e **సింహం** : ఖర్చులు అధికంగా ఉంటాయి. వృత్తి, వ్యాపారాలకు సంబం ధించిన ఒక నిర్ణయం తీసుకుంటారు. ఆడిటర్లకు విశ్రాంతి లభించును. రాబడికి మించిన ఖర్చులు పెరగడంతో ఒకింత ఆందోళనకు గురవు తారు. స్త్రీలకు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. f**కన్య** : కుటుంబీకుస మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. మార్కెటింగ్ రంగాల్లో వారికి అనుకూలత. నిరుద్యోగులతు ఆశాజనకం. దైవ, శుభకార్యాల్లో చురుకుగా వ్యవహ రిస్తారు. స్త్రీలు కళాత్మక రంగాల పట్ల ఆసక్తి పెంచుకుంటారు. వ్యాపారాభివృద్ధికి నూతన ప్రణాళికలు, పథకాలు అమలు చేస్తారు. g **తుల** : ప్రేమికుల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తవచ్చు. వాహన చోదకులు వాహనం నడుపునపుడు మెల కువ వహించండి. ఆత్మీయులతో విందులు, పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. వస్త్ర, బంగాలు, వెండి, లోహ, రత్న వ్యాపారస్తులకు పురోభివృద్ధి. ప్రముఖుల కల యిక ప్రయోజనకరంగా ఉంటుంది. h **వృశ్చికం** : స్త్రీలకు అపరిచిత వ్యక్తుల విషయంలో మెలకువ అవసకం. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారు లకు సంతృప్తి, పురోభివృద్ధి. భాగ స్వామి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వస్త్రాలు, వస్తువులు అమర్చు కుంటారు. i **ధనుస్సు** : టెక్నికల్, ఎలక్ట్రానికల్ రంగా లలో బాగా అభివృద్ధి చెందు తారు. ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేస్తారు. సన్నిహితుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. స్త్రీలకు విలువైన వస్తు వులు, ఆభరణాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. నిర్మాణ పనులలో కాంట్రాక్టర్లు సంతృప్తి, పురోభివృద్ధి. j**మకరం** : మీ ముఖ్యుల కోసం ధనం బాగా వెచ్చించవలసి వస్తుంది. నూతన దంపతులకు ఎడబాటు తప్పదు. ఉద్యోగస్తులు శ్రమకు తగిన ఫలితం పొందుతారు. మీ సంతానం మొండి వైఖరి మిమ్మలను చికాకు పరు స్తుంది. దూరపు బంధువుల ఆరోగ్య విషయంలో ఆందోళన చెందుతారు. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళుకువ అవసరం.నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవుతారు. రావలసిన ధనం వాయిదా పడుట వల్ల ఆందోళనకు గురవ తారు. k **కుంభం** : నిరుద్యోగులకు సదవకాశాలు లభిస్తాయి. మీ యత్నాలకు సన్నిహితులు అన్నివిధాలా సహకారం అందిస్తారు. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల తీరు ఆందోళన కలిగిస్తుంది. L **మీనం** : మీ సంతానం ఉన్నత విద్యావకాశాల గురించి ఆందోళన చెందుతారు. గృహంలో శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. స్త్రీలు విలువైన వస్త్రాలు, ఆభరణాలు అమర్చుకుంటారు. బంధు మిత్రుల కల యికతో నూతన ఉత్సాహం కానవస్తుంది. గృహంలో మార్పులు, మరమ్మత్తులు చేపడతారు.

# చందన రూపుడు... సింహాచలేశుడు

సంకీర్తన



దేశంలోని అన్ని నారసింహ క్షేత్రాల్లో విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం క్షేత్రం అతి ప్రాచీనమైనది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ విశాఖపట్నం నగరానికి 11 కి.మీల దూరంలో తూర్పు కనుమల్లోని సింహగిరిపై సముద్రమట్టానికి 800 అడుగుల(244మీ)ఎత్తున ప్రశాంత వాతావరణంలో శ్రీవరాహ లక్ష్మీ న ృసింహ స్వామి ఆలయం ఉంది. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశారు. సింహాచలం ప్రముఖ హిందూ పుణ్యక్షేత్రంగా ఉంది. విశాఖ పరిసర ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంత భక్తులంతా సింహాద్రి అప్పన్నగా పిలుచుకునే వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఇక్కడ కొలువ్కై ఉన్నాడు. నిత్యం చందనంతో కప్పబడి కనిపించే ఈ స్వామి నిజరూప దర్శన సమయాన్ని చందన యాత్ర లేదా చందనోత్సవం అని అంటారు. ఇది ప్రతి సంవత్సరం వ్కెశాఖ శుద్ధ తదియ (మే నెలలో) వస్తుంది.

ఆలయ చరిత్ర-స్థల పురాణం

స్వయంభూవ్కెన సింహాచల శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి వారికి ఇక్కడ 11వ శతాబ్దంలో ఆలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం బట్టి తెలుస్తోంది. కళింగ శైలిలో నిర్మించిన ఈ ఆలయం అదుతేమైన శిల్ప కళ, అందమైన గోపురాలతో భక్తులకు కనువిందు చేస్తుంది. ఆలయంలో పలు చారిత్రక సందరాల్లో వేసిన శిలా శాసనాలు చారిత్రక పరిశోధకులను ఆకర్షిస్తాయి. సత్యకాలంలో వేదాలు అపహరించిన హిరణ్యాక్షుడిని సంహరించిన వరాహ అవతారం, ఆ తర్వాత యుగంలో హరి ద్వేషంతో.. భక్తులను హింసించిన హిరణ్యకశిపుని వధించిన న ృసింహావతారాల కలయికగా.. స్వామి ఇక్కడ వరాహ న ృసింహ స్వామిగా స్వయం వ్యక్తమయ్యారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఇక్కడ రోజూ నాలుగు వేదాలు, నాలాయిర దివ్య ప్రబంధాలు, పురాణాలు స్వామి వారి సన్నిధిలో పారాయణ చేస్తారు. ఇది దక్షిణ భారతదేశంలోని ముఖ్యమైన వ్కెష?వ పుణ్యక్షేత్రాల్లో ఒకటి. తిరుపతి తర్వాత అత్యధిక ఆదాయం (రూ.52 కోట్లు)కలిగిన దేవాలయమిదే. ఏడాది మొత్తంలో 12 గంటలు మాత్రమే దేవుడి నిజరూప దర్శనం భక్తులకు లభిస్తుంది. శ్రీవరాహ లక్ష్మీ న ృసింహస్వామి వారు ఏడాదిలో 364 రోజులు సుగంధ భరిత చందనంతో కప్పబడి ఉంటారు. భక్తులకు నిత్యం దర్శనం ఇచ్చేది.. ఈ చందన అవతారంలో వుండే స్వామి వారే. ఏటా ఒక్క వైశాఖ శుద్ధ తదియ నాడు మాత్రమే.. అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం వరకూ ఆ నిజరూప దర్శనం ఉంటుంది. స్వామి వారి నుంచి తొలగించిన గంధాన్ని చందన ప్రసా దంగా భక్తులకు అందజేస్తారు. అలాగే గిరి ప్రదక్షిణ కూడా ఇక్కడ ప్రత్యేకంగా జరిగే ఉత్సవం.



మిగతా సమయాల్లోనూ ఎంతో రద్దీగా ఉండే సింహాచలం ఆలయం ఈ రెండు సందరాల్లో ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బంగా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి తరలివచ్చే లక్షల మంది భక్తులతో మరింత రద్దీగా మారుతుంది. ఈ సందర్భంగా ప్రత్యేక ఆర్జిత సేవలు ఉంటాయి. ఆలయంలో కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకొని కోరికలు కోరుకుంటే అవి తీరుతాయనేది భక్తుల విశ్వాసం.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## దివ్యాంగులకు సేవ చేయడంలో సంతృప్తి

కంచరపాలెం : దివ్యంగులకు సేవ చేయడంలో సంతృప్తి కలుగుతుందని ఇటివలే ప్రముఖ కార్పొరేట్ సంస్థ డాజిల్ నిర్వహించిన మిస్ ఆంధ్ర ఎంపికలో విన్నర్‌గా ఎంపికైన మామిడి సాయి వెంకట పల్లవి పెర్కొన్నారు.

## ఘనంగా బిఎస్ఐ డిజాక్-2018 సంరంభం

FLAT FOR SALE
Chinamushidiwada Syamala Heights, Group House 2 BHK, 950 Sft, 4yrs Old, S/F Lift & Car Parking Available, No Broker, Immediate Sale.
CONT : 9885040790

విశాఖపట్నం : బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్ నేషనల్ (బిఎస్ఇ) డిజాక్-2018 సంరంభం నగరంలోని ప్రముఖ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఎస్ఐ ఎగ్జి క్యూటివ్ డైరెక్టర్ కెవిటీ రమేష్ మాట్లాడుతూ వ్యాపారంలో ఒకరికొకరు సహకరించు కునేందుకు ఏర్పాటయిందే బిఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ మార్కెట్ అధ్యక్షుడు శ్రీనివాసన్, మురళీ శ్రీనివాసన్, మిధున్ కొమ్మన తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలు పరిశీలించిన ఎన్.ఐ.పి.సి.సి.డి. అసిస్టెంట్ డైరెక్టర్

భీమునిపట్నం : భీమిలి మండలం లో మంగమారిపేట,పుక్కల్ల పాలెం,నేరల్లవలస, భీమిలి డివిజన్ లో ఎగువపేట ,తోటవీది ,బర్మాకోలనీ,అప్పికొండవీది, తగరపువలస డివిజన్ చాకలిపేట, కొండపెటలలో వున్న అంగన్వాడీ కేంద్రాలు డిల్లీ కి చెందిన ఎన్.ఐ.పి.సి.సి.డి టీం అసిస్టెంట్ డైరెక్టర్ సీమా గుప్తా సోమవారం అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కేంద్రాలలో అన్ని సదుపాయాలను పరిశీలించి నివేదికను డిల్లీ కి పంపుతామని ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమం లో ఐ,సి,డి.సి పి.ఓ జి క్రిష్ణవేణి సూపర్ వైజర్స్ అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## షటిల్ టోర్నమెంట్ ప్రారంభం



భీమునిపట్నం : తగరపువలస గంటా జన్మదినోత్సవం పురస్కరించుకుని స్థానిక చిట్టివలస పాత టెన్నీస్ కోర్టు లో గంటా శ్రీనివాసరావు ఛాలెంజెస్ ట్రాఫీ షటిల్ టోర్నమెంట్ మంత్రి వర్యులు గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పోటిలు నాలుగు రోజుల పాటు జరుగుతాయని నిర్వాహుకులు తెలిపారు. ఈ కార్యక్రమం భీమిలి నియోజవర్గ ఇన్ చార్జ్ చిక్కాల విజయ బాబు, న్యాయవాది కె.ఎస్. ఎం.సుధాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ డి.శైలేందర్ రెడ్డి, భీమిలి తగరపువలస డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు, కొప్పల. రమేష్, సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి. శ్రీనివాసరావు,నాయుకులు పి,యోగి, ం,.సంజీవ్, గిడుతూరి శ్రీనివాస రావు , వుయ్ కేర్ యు సంస్థ ఇన్ ఛార్జ్ వెంపాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు

### జిల్లా అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు



విజయనగరం: పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్సు సెల్‌కు 15 ఫిర్యాదులు వచ్చాయి. విజయనగరం పట్టణానికి చెందిన తొత్తల సూరిబాబు అదనపు ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తాను చోడిపల్లి బండయ్య అనే వ్యక్తికి రూ॥ 2.60 లక్షలు చేబదులుగా ఇచ్చినట్లు, ప్రస్తుతం తన అవసరమని డబ్బులు అడిగినప్పటికి తిరిగి ఇవ్వడం లేదని, వడ్డీ కూడా చెల్లించడం లేదని, న్యాయం చేయాలని కోరినారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అదనపు ఎస్పీ ఫిర్యాది సీనియర్ సిటిజన్ అయినందున విచారణ చేయాలని, ఫిర్యాదికి న్యాయం చేయాలని విజయనగరం 2వ పట్టణ సిఐను ఆదేశించారు. డెంకాడకు చెందిన చలమూరు రమణ అదనపు ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తన తండ్రి పాల కేంద్రం నడుపుతున్నట్లు, లావాదేవీలన్నియూ తాను చూస్తున్నట్లు, పాల రైతులు తీసుకున్న రుణాలు గురించి సమీక్షా సమావేశంలో ప్రశ్నించినందుకుగాను తనపై సిరికి అప్పారావు మరియు చలుమూరి అప్పారావులు దాడులకు పాల్పడినట్లు, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అదనపు ఎస్పీ విచారణ చేపట్టి, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా డెంకాడ ఎస్ఐను ఆదేశించారు. విజయనగరం పట్టణానికి చెందిన వంకాల విజయ అదనపు ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ మత్స శ్రీను అనే వ్యక్తి బ్యాంకు నుండి ఇల్లు కొనేందుకుగాను రుణం పొందిన తరువాత తన పేరున రిజిస్ట్రేషను చేస్తానని తనను నమ్మించినట్లు, తాను పూర్తి డబ్బులు ల్లించినప్పటికి, తన పేరున ఇంటిని రిజిస్ట్రేషను చేయకుండా తిప్పుతున్నట్లు, న్యాయంేయాల్సిందిగా అదనపు ఎస్పీగార్ని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అదనపు ఎస్పీ పూర్తి స్థాయి విచారణ చేపట్టి, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా విజయ నగరం 2వ పట్టణ సిఐను ఆదేశించారు.బలిజిపేట మండలానికి చెందిన పొందూరు భవానీ అదనపు ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తనఇంటిలో దొంగతనం జరిగి రూ॥ 16 వేలు నగదు, అర తులం బంగారం పోయినట్లు, తనకు స్థానికంగా ఉండే వ్యక్తిపైఅనుమానం ఉన్నట్లు, న్యాయం చేయాల్సిందిగా అదనపు ఎస్పీని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అదనపు ఎస్పీ విచారణ చేసి, న్యాయం చేయాల్సిందిగా బలిజిపేట ఎస్ఐను ఆదేశించారు. తెర్లాం మండలానికి చెందిన బగ్గ రాజేశ్వరి అదనపు ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తన భర్తతో కలసి అత్తవారింటికివెళ్లగా ఆడపడుచు, మరిది తనను, తన భర్తను కొట్టినట్లు, వారి నుండి తమకు ప్రాణ హానిఉన్నట్లుగా, రక్షణ కల్పించాల్సిందిగా కోరారు. ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా తెర్లాం ఎస్ఐను ఆదేశించారు. అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను జిల్లా ఎస్పీకి వెంటనే నివేదించాలని అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐలు జి. రామకృష్ణ పాల్గొన్నారు.

## పిడిఫ్, గెస్ట్ ఫ్యాకల్టీలు సర్టిఫికెట్స్ దహనం



శిబిరంలో బాధితులతో మాట్లాడుతున్న తైనాల విజయకుమార్

ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గత ఏడు రోజులుగా కొనసాగుతున్న పోస్ట్‌డాక్టరల్ ఫెలోస్, గెస్ట్‌ఫ్యాకల్టీల రిలేనిరాహారదీక్షలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. వారం రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి వర్శిటీ యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో బాధితులు తమ సర్టిఫికెట్లను దగ్ధం చేసేందుకు నిర్ణయించారు. మంగళ వారం ఉదయం 11 వర్శిటీ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్‌సిపి నాయకులు తైనాల విజయకుమార్ నిరసన శిబిరాన్ని సందర్శించి తమ పార్టీ అధికారంలోకి వస్తే పోస్ట్‌డాక్టరల్, గెస్ట్ ఫ్యాకల్టీల సమస్యలను సత్వరమే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్రచైతన్యపార్టీ అధ్యక్షులు కె.రామానాయుడు తదితరులు వున్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యతనివ్వండి-

### కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం, : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ముఖ్యమైన పథకాలకు ప్రాధాన్యతనివ్వాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. కాన్ఫరెన్స్ హాలులో ఇంజనీరింగ్ అధికారులు, జోనల్ కమిషనర్లు, ఏ.యం.ఓ.హెచ్, పట్టణ ప్రణాళిక, యుసిడి అధికారులతో సోమవారం పథకాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డి.ఆర్.సి (జిల్లా సమీక్షా సమావేశం) లో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఆందరికీ గృహాలుకు ఎంపిక, ఎలాట్‌మెంట్, డి.డిలు కట్టించడం, బ్యాంక్ రుణం మంజూరు విషయంలో శ్రద్ధ తీసుకోని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇ.ఆర్.పి మాడ్యూల్సును విభాగాల వారీగా అమలు చేసేలా అదనపు కమిషనర్ (జనరల్), డి.సి.ఆర్‌లు పర్యవేక్షించాలని సూచించారు.ప్రజారోగ్యవిభాగం 279 ప్రభుత్వ ఉత్తర్వు, ఆర్.టి యం.యస్ అమలు జరిగేలాచర్యలు తీసుకోవాలని సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్‌ను ఆదేశించారు.అదేవిదంగా ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సలహాలు,సూచనలతో పనితీరును మెరుగు పడేలా చోరవచూపాలని కోరారు.

అమృత్ పథకంలో ప్రతి ఇంటికి కోళాయి, యుజిడి కనెక్షన్ వేయాలని పేర్కోన్నారు. అదేవిధంగా నియోజకవర్గాల వారీగా అభివృద్ధి పనుల కేటాయింపు, ప్రస్తుత ప్రగతిపై అడిగి తెలుసుకొన్నారు. మంజూరు చేసిన అన్ని పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

నగరంలో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయడంతో బాటు ప్యాసివ్ సర్వయిలెన్స్ చేసి వ్యాధులు నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 2019కి ఉత్తమ ర్యాంక్ సాధనకు అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ విశాఖ -ఆరోగ్య విశాఖకు దోహదపడాలని పేర్కోన్నారు.

## 15వ వార్డు రెల్లివీధిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు



భీమునిపట్నం : భీమిలి డివిజన్ 15వ వార్డు రెల్లివీధి లో తెలుగుదేశం పార్టీ . మొదటి సభ్యత్వం తెలుగుదేశం పార్టీ భీమిలి డివిజన్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కుప్పిల దుర్గకి డివిజన్అధ్యక్షులు గంటా నూకరాజు అందజేసారు. ఈ సందర్భంగా గంటా నూక రాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమన్ని , నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో నడుస్తున్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరూ శాశ్వత సభ్యత్వాలు తీసుకోవాలని సూచించారు. 100/-లు సభ్యత్వంలో నారా లోకేష్ బాబు సలహమేరకు జీవితభీమాను పొందపరచామని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత పేదప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని, మనం సభ్యత్వాలు పొందడం ద్వారా చంద్రబాబు నాయుడు మనం ఇచ్చే బహుమానం అని . రాష్ట్రం మొత్తం ఏ రాజకీయ పార్టీకి లేని కుటుంబం మనదని ఇంత పెద్ద కుటుంబంతో 2019 ఎన్నికల్లో మరలా మనం ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు చూడవలసిన అవసరం ఉందని గంటా నూకరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు జన్మభూమి కమిటీ సభ్యులు కుప్పిల దుర్గ,, గూడుపు రాజు, మురళితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు డొకర సన్యాసప్పడు, చురకల రమణ, కనకల అప్పలనాయుడు, ఊళ్ళ దుర్గారావు, గిడుతూరి శ్రీనివాసరావు, సిద్దార్ధ వర్మరాజు, వాడ మొదలు సత్యారావు, రాజగిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల సంఘానికి 75% రాయితీపై రవాణా వాహనం

### జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్

విశాఖపట్నం : సేంద్రియ ఎరువుల సాగుతో కూరగాయలు, పండ్లు ఉత్పత్తి చేసే కె.కోటపాడు కు చెందిన భార్గవ్ రైతు ఉత్పత్తిదారుల సంఘానికి 75% రాయితీపై అందజేసిన రవాణా వాహనాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రవీణ్కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో ఈ వాహనాన్ని ప్రారంభించిన అనంతరం రైతులతో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రూ. 7,50,000/- లు ఖరీదు చేసే ఈ వాహనాన్ని రాష్ట్రీయ కృషి వికాస్ యోజన నిధులతో 75 శాతం రాయితీపై అందజేయడం జరిగిందన్నారు. ఈ వాహనాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సేంద్రియ ఎరువుల సాగుతో ఉత్పత్తి చేసిన కూర గాయలు, పండ్లను తక్కువ ధరలకే ప్రజలకు అందజేయాలని ఆయన కోరారు.

ఇదేవిధంగా సేంద్రియ ఎరువుల సాగుతో ఉద్యానవన పంటల ఉత్పత్తులను దిగుబడి చేసే రైతులందరూ కలిసి సంఘాలుగా ఏర్పడితే, వారి కూడా 75 శాతం రాయితీపై ఇటువంటి వాహనాలను అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు శైలజ, ఉత్పత్తిదారుల సంఘాలు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చెయాలి




అచ్యుతాపురం : పూడిమడకలో ప్రభుత్వం ,ఇన్ఫోసిస్ వారు నిర్మించిన ఇల్లులను అర్హులైన లబ్దిదారులకు ఇవ్వాలని గ్రామదర్శినిలో వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన చేపల తాతయ్య పై అన్యాయంగా దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె లోకనాథం డిమాండ్ చేశారు .సోమవారం చేపల తాతయ్య పై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలని తహశీల్దార్ కార్యలయం వద్ద దర్నా నిర్వహించి తహశీల్దార్ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు . అర్హులైన వారికీ ఇల్లులు ఇవ్వాలని అనేకసార్లు అధికారులను కలిసిన పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు . దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయకపోతే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ దర్నాలో సిపిఎం నాయకులు రొంగలి రాము ,కర్రి అప్పారావు ,కె సోమునాయిడు , వైస్సార్సీపీ నాయకులు చేపల శ్రీరాములు , ఒరుపుల అప్పలరాజు ,జనసేన నాయకులు మేరుగు ప్రవీణ్ కమార్ ,మేరుగు వసంతరావు తదితరులు పాల్గొన్నారు .

**గ్రేటర్ విశాఖ 8వవార్డు పరిధిలో గల సెక్టార్ 6 పరిసర ప్రాంతాల్లో గడప గడప కు నవరత్నాలు కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాస్ వంశీకృష్ణ పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి నవరత్నాలు తో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ, భారీగా పాల్గొన్న స్థానికులతో ర్యాలీగా ప్రారంభమై, అందరిని కలుస్తూ ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక భూత్ కమిటీ,వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.**



## భక్తి శ్రద్ధలతో రుద్రాభిషేకాలు

విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ వరల్డ్ టీచర్ ట్రస్ట్ సభ్యులు కంచర్ల రాజేశ్వరరావు ఆధ్వర్యంలోఉడాకాలనీలో రుద్రాభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన ప్రముఖ వేదపండితులు కృష్ణశర్మ నేతృత్వంలో వేదమంత్రాల నడుమ నమక చమకాలతో పరమ శివునికి ప్రత్యేకంగా రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కృష్ణారావు, కామరాజు, సుధాకర్‌రావు, గిరిజా ప్రసన్న, మీరా తదితరులు పాల్గొన్నారు.కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో పట్టణంలో శివాలయాలుతెల్లవారు ఝూము నుండే భక్తుల రాకతో కిటకిటలాడాయి. క్తొ అగ్రహారం శ్రీసీతారామ కాశీవిశ్వేశ్వర ఆలయంలో అర్చకులు భమిడిపాటి రామకుమార శర్మ శ్రీస్వామి వారికి క్షీరాభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహించారు. దేవస్థానం ఇ.ఓ బి.ఎల్.నగేష్ పర్యవేక్షణలో జరిగిన సామూహిక సత్యనారాయణ వ్రతలు భక్తులచే జరిపించారు. శివాలయం వీదిలోని ఉమాలింగేశ్వర ఆలయం, పులిగెడ్డ వారి వీధిలో ఉన్న విమర్శక్రాశక శివాలయం, బాబామెట్టలోని శివపంచాయతన ఆలయం, శంక మతంలో అద్వైత సభ ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు విశేషంగా జరిగాయి.

## ఇ-ఆఫీస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి: డిఆర్ఓ వెంకటరావు

విజయనగరం: ఇ-ఆఫీస్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా రెవిన్యూ అధికారి జె.వెంకటరావు ఆదేశించారు. సోమవారం కలకటర్ ఆడిటోరియంలో మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.

మీ కోసం వచ్చిన దరఖాస్తులు భూధార్, సాదాబైనామీలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులు, అనుమాన్పద ఓటర్లు, విఐపిల ఓటర్లు మార్కింగ్ కూడా పరిష్కరించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా 703 వచ్చాయని, వెంటనే వాటిని పరిశీలించాలన్నారు. ఇ-పంట నమోదు, పశువుల పంపిణీకి సంబంధించిన పనులు త్వరితగతిన చేయాలన్నారు. కన్వర్జన్సీ కార్యక్రమానికి నాలుగునెలల్లో నిధులు వస్తాయని అంగన్‌వాడీ భవనాలు, సిసి రోడ్లు, పంచాయితీ భవనాలు, మిని గోకులం పనులు వేగవంతం చేయాలని కోరారు.

పర్వేచేయని ప్రాంతాలను సర్వే చేసి సోక్‌పిట్స్‌ఏర్పాటుచేయాలని, న్యూట్రి గార్డెన్స్ పనులు కూడా చేపట్టాలని ఆదేశించారు. సెలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాహసిల్ధార్లు, ఎంపిడిఓలు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 8న అవంతీ కళాశాలలో పాలీఫెస్ట్ సంకల్ప్ 2018-19



భీమునిపట్నం : తగరపువలస అవంతీ కళాశాలలో ఈ నెల 8 న పాలీ ఫెస్ట్ సంకల్ప్ 2ఖ 18-19 రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు అవంతీ కళాశాల చైర్మన్ అనకాపల్లి ఎం.పి అవంతి శ్రీనివాసరావు తెలిపారు.

కళాశాల ఆవరణలో సోమవారం సదస్సుకు సబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించే క్రమంలో నిర్వహిస్తున్న ఈ వేడుకులకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మొదలగు జిల్లాలకు చెందిన కళాశాల మరియు పాటసాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజినేరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎన్.వి గణేష్, అర్జునరావు,డైరెక్టర్లు ఎ.చంద్రశేఖర్,ఎస్.విశ్వప్రసాద్ తదీతరులు పాల్గొన్నారు.

# సీ సన్ హెల్త్‌కేర్ పరిశ్రమ ప్రారంభం

## పరిశ్రమ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జిస్తుంది - మంత్రి మల్లాడి





యానాం: దరియాలతిప్ప సీతారాం నగర్‌లో డాక్టర్ రెడ్డి ల్యాబ్ పరిశ్రమ స్థానంలో నూతనంగా ఏర్పాటుచేసిన సీ సన్ హెల్త్‌కేర్ పరిశ్రమను పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు డాక్టర్ రెడ్డి ల్యాబ్ సిఇఒ జివి ప్రసాద్‌లు ప్రారంభించారు. సోమవారం మధ్యాహ్నం రూ. 12 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ ప్రారంభోత్సవానికి వారు ముఖ్యఅతిధులుగా విచ్చేసి పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటి అనంతరం వేద పండితుల సమక్షంలో పూజలు నిర్వహించి లాంఛనంగా పరిశ్రమను ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమలోని తయారుచేస్తున్న వివిధ రకాల మందుల తయారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభనలో మంత్రి మల్లాడి మాట్లాడుతూ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన డాక్టర్ రెడ్డి ల్యాబ్ స్థానంలో సీ సన్ హెల్త్‌కేర్ పరిశ్రమను ఏర్పాటుచేయడం రెడ్డి ల్యాబ్ అధికారుల సహకారంతో ఎంతో అభివృద్ధిచెంది భవిష్యత్‌లో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జిస్తుందని తద్వారా యానాంకు మంచిపేరు తీసుకువస్తారని ఆశిస్తున్నానన్నారు. గతంలో పనిచేసిన ఉద్యోగులకు అవకాశాలు ఇవ్వాలని ఈ కంపెనీ దినదినాభివృద్ధి చెందడానికి ప్రభుత్వ పరంగా తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ పరిశ్రమను తీసుకురావడానికి కృషిచేసినవారిని అభినందించారు. ఈ సభలో సిసన్ హెల్త్‌కేర్ ఎండి సి. విజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రి మల్లాడి సహకారంవల్లనే సాధ్యమైందన్నారు. తొలిత మంత్రి మల్లాడిని కలిసేందుకు వచ్చినప్పుడు ప్రజలు చుట్టుముట్టి ఉండటంవలన ఆయన బిజీషెడ్యూల కారణంగా తిరిగి వెళిపోదాం అనుకున్నామని కాని మేము కలిసిన తరువాత ఆయన చూపించిన ఆధరణ చూసి ఈ పరిశ్రమను ఏర్పాటుచేయడానికి సహకారం అందిచారన్నారు. ఈ రంగంలో రావడానికి డాక్టర్ రెడ్డి ల్యాబ్‌ను స్థాపించిన డాక్టర్ అంజిరెడ్డి ప్రోత్సాహంవలన వచ్చానన్నారు. వారి పరిశ్రమను యానాంలో తీసుకోవడం ఎంతో బాగ్యంగా భావించామన్నారు. ఈ యూనిట్ ఇక్కడకు రావటానికి మూడు సంవత్సరాలు పట్టిందన్నారు. రోజుకు 6 లక్షలు మందులు తయారుచేయటమే లక్ష్యంఅని ఇటువంటి పరిశ్రమను మూడు తీసుకురావాలనుకుంటున్నామన్నారు. రాబోయే కాలంలో రూ. 400 కోట్లతో ఈ యూనిట్లు ఏర్పాటుచేస్తామన్నారు. ఈ సభలో డాక్టర్ రెడ్డి ల్యాబ్ సిఇఓ జివి ప్రసాద్ మాట్లాడుతూ ఈ పరిశ్రమ యానాంలో ఏర్పాటుచేయడానికి మంత్రి చొరవవల్లనే సాధ్యం అయ్యిందన్నారు. గతంలో రెడ్డి ల్యాబ్ ఏర్పాటుకు ఆయన అందించిన సహకారం మర్చిపోలేనిదన్నారు. ఈ సభలో మంత్రి మల్లాడిని , సిఇవో జివి ప్రసాద్ ను, పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ జి. గౌరీసరోజ్, ఈ పరిశ్రమ ఏర్పాటుకు సహకరించిన ప్రముఖలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ టి. అరుదయ కుమార్, బి. పాపిరెడ్డి, పి. రాకేష్‌హర్ రెడ్డి, టిఎస్ రాజేశ్వరరావు, పలువురు ప్రముఖులు, నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రికార్డుస్థాయిలో సభ్యత్వ నమోదు

### నిరుపేద విద్యార్థుల విద్య మధ్యలో ఆగిపోకుడదు : వాసుపల్లి



విశాఖపట్నం: విశాఖ దక్షిణం నుంచి టిడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తుందని రికార్డుస్థాయిలో ఇప్పటి వరకు 28500 సభ్యత్వాలు పూర్తి అవ్వడం సంతోషంగా ఉందని దక్షిణ నియోజక వర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబుదేనని కొనాయాడారు. ఈ సందర్భంగా ఆయన అల్లిపురానికి చెందిన హర్షిత అనే విద్యార్థి పేదరికం కారణంగా ఫీజులు చెల్లించ లేకపోవడంతో చదవుకు బ్రేకు పడిన విద్యార్థినీ దయనీయ స్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే ఆ విద్యార్థికి రూ. 3 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు అండగా ఉంటానని బరోసా ఇచ్చారు.



*విశాఖపట్నం: స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఎపి స్టేట్ కల్చరల్ అవేర్‌నెస్ సొసైటీ సారధ్యంలో 'తెలుగు సాంస్కృతిక మహోత్సవం - 2018' పేరిట జాతీయస్థాయి కళాకారులతో సంస్థ 12వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సెకెండ్ క్లాస్ జడ్జి (గుడివాడ) దేవు నర్సింహరావు, పోలీస్ సెంటర్ కమాండెంట్ కె. నాగరాజు, సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గణగళ్ళ విజయ్‌కుమార్, డాక్టర్ మైనేని కృష్ణకుమారి, తెలంగాణ రాష్ట్ర జనసత్తా అధ్యక్షుడు ముధుగంటి సుధాకరరెడ్డిలు పాల్గొన్నారు.*

## ఘనంగా వికలాంగుల దినోత్సవం

యానాం: ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని యానాంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం స్థానిక చిల్డ్రన్ ఆడిటోరియంలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వికలాంగు దినోత్సవ సభకు ముఖ్య అతిధిగా పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు హాజరై మాట్లాడారు. వికలాంగుల సంక్షేమానికి పుదుచ్చేరి ప్రభుత్వం అనేక పథకాలను అమలుచేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. వికలాంగులకు ఏ రాష్ట్రంలో లేని సదుపాయాలను ఇక్కడ అమలుచేస్తుందన్నారు. ఈ సభలో పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందేలా అధికారులు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ సభలో మున్సిపల్ కమీషనర్ గౌరీసరోజ, ఆసుపత్రి డిడి ఎంవిఎస్ ప్రసాద్, విద్యాశాఖ అధికారి కాలేసాయినాధ్, వికలాంగుల సంక్షేమ సంఘం గౌర అధ్యక్షులు నున్నా వెంకట రామక్రిష్ణారావు, సోషల్ వెల్ఫేర్ అధికారి చింతారామజోగి, జె. ఊర్మిళ, ఆర్. వెంకన్న, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

## సైకిల్‌పై శబరి యాత్రకు బయలుదేరిన స్వాములు

యానాం: శ్రీ మణికంఠ స్వామీ కమిటీ ఆధ్వర్యంలో నల్గురు స్వాములు శబరిమలైకు సైకిల్ యాత్రపై బయలుదేరారు. సోమవారం ఉదయం స్థానిక ఫెర్రీరోడ్డులోని స్వామి అయ్యప్ప దేవాలయం వద్ద కమిటీ సభ్యులు ఈ యాత్రను ప్రారంభించారు. స్థానిక శివాలయం, షిరిడీసాయి, కనకదుర్గమ్మ దేవాలయం, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, పిల్లారాయి దేవాలయాలో పూజులు నిర్వహించి ఈ యాత్రను కొనసాగించారు. స్థానిక జిఎంసి బాలయోగి కాలనీకి చెందిన కొల్లు నాగేశ్వరరావు సహకారంతో ఈ యాత్రకు బయలుదేరు తున్నట్లు స్వాములు తెలిపారు. నేటి నుండి సుమారు 11 రోజులపాటు సైకిలుపై శబరి మలైకు చేరుకోనున్నట్లు వారు తెలిపారు. వారికి కుటుంబ సభ్యులు విడ్కోలు పలికారు.

## రత్నగిరిపై పోటెత్తిన భక్త జనం



అన్నవరం...తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో కార్తీకమాసం చివరి సోమవారం మరియు ఏకాదశి కావడంతో భక్తుల రద్దీ అధికంగా ఉంది వేకువజామున ఒంటి గంట నుండి భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు దర్శనం క్యూలైన్ల ద్వారా మంచినీటి సదుపాయం మరియు వ్రత మండపాలలో ప్రత్యేక సిబ్బందిని నియమించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు .మరియు ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రసాదం విక్రయాలు మరియు ఉచిత పులిహోర దద్దోజనం వితరణ చేసారు.

# ముత్యాలమ్మపాలెంలో ప్రజా భరోసా యాత్ర ప్రారంభం

## అదీప్ రాజ్‌కు అడుగుఅడుగునా ప్రజానీరాజనం



పరవాడ: వైసిపి రాష్ట్ర అద్యక్షులు జగన్మోహన్ రెడ్డి అదేశాలుమేరకు పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ సోమవారం ప్రజా భరోసా యాత్రను పరవాడ మండలము ముత్యాలమ్మపాలెం గ్రామంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి పార్లమెంటరీ అద్యక్షులు గుడివాడ అమర్ నాధ్ హజరై అతని చేతులు మీదగా ప్రారంభించారు.ఈభరోసాయాత్ర పరవాడ మండలము ముత్యాలమ్మపాలెం, వెంకటపతిపాలెం, నాయుడుపాలెం, వాడ చీపురుపల్లి, ఉటగెడ్డ పాలెం, తిక్కవానిపాలెం తథితర గ్రామాల్లో ఈ యాత్ర కోనసాగింది. అనంతరము అయన మాట్లడుతూ ఎన్నికల్లో ముందు ఇచ్చిన హామీలును నెరవేర్చడములో టిడిపి ప్రభుత్వము పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రజా సమస్యలు తెలిసికునేందుకుగాను ఈపాదయాత్రచేస్తున్నామని ఈ పాదయాత్రకు మహిళలు అధిక సంఖ్యలో పొల్గోని బ్రహ్మరధం పట్టారు. పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాట్లడుతూ తెలుగుదేశంపార్టి హయంలో పెందుర్తి నియోజకవర్గాన్ని అవినీతి నియోజకవర్గముగా తయారుఅయ్యందిని అన్నారు. వైసిపి పార్టి అదికారములోకివస్తే తనమనభేధం లేకుండా ఏపార్టి అని చూడకుండా జగన్ అన్న ప్రవేశపెట్టిన నవరాత్నలును అందరికీ అందేలా చూస్తామని హమీ ఇచ్చారు. జగన్ అన్నను ముఖ్యమంత్రి చేసేవరుకు ప్రతిఒక్క కార్యకర్త సైనికుడులా పనిచేయాలనిఅన్నారు.అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త వరుదుకళ్యాణి మాట్లడుతూ రానున్నరాజ్యం జగన్ అన్న రాజ్యమని ఎన్నిశక్తులువచ్చిన జగన్ అన్న సిఎం అవ్వడము తథ్యమని ఈ సందర్భంగా అమే అన్నారు.రాష్ట సిఇసి సభ్యులు పైలశ్రీనువాసురావు మాట్లడుతూ అదీప్ రాజ్ చేపట్టిన ప్రజాభరోసా యాత్రకు విశేషస్పందన లభించిందిని, పెందుర్తి నియోజకవర్గంలో అదీప్ రాజ్ నుశాసనసభ్యులుగా గెలిపించి జగన్ అన్నకు బహుమతిగా అందజేస్తామని ఈ సందర్భంగా అయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టి ప్రెసిడెంట్ సిరపురపు అప్పలనాయుడు,జిల్లాప్రదానకార్యదర్శి చుక్క రామునాయుడు, ముత్యాలమ్మపాలెం మాజీ సర్పంచ్ బొంది ధనలక్ష్మి, బొంది అచ్చిబాబు, కొటాన రాము, చల్లా కనకారావు,వెన్నెలసన్యాశిరావు, బండారురామారావు, యువజనఅద్యక్షులు పెదిశెట్టిశేఖర్ , రాజు, పైలనరేష్ , బొందిమహేష్, గెడ్డంఉమ తథితర్లు పాల్గోన్నారు.

# కురుమళ్ళ చేరిక జనసేనకు మరింత బలం

## పిఠాపురం జనసేన సమన్వయ కమిటీ సభ్యులు వెల్లడి



పిఠాపురం : మాజీ ఎంపిపి కురుమళ్ళ రాంబాబు చేరిక జనసేనకు మరింత బలం అని, ఆయన రాకతో జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందని పిఠాపురం జనసేన సమన్వయ కమిటీ సభ్యులు తెలియజేసారు. ఇటీవల జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరిన రాంబాబును స్థానిక సూర్యరాయ గ్రంధాలయం నందు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ సంధర్భంగా కురుమళ్ళ రాంబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి కష్టించి పనిచేస్తానని, అధినేత ఆదేశాల మేరకు పిఠాపు రం నియోజకవర్గంలో జనసేన పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత ముందుకు తీసుకువెళతా నన్నారు. అందరిని సమన్వయ పరచుకుని, అందరితో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సమన్వయ కమిటీ సభ్యులు సూరవరపు సురేష్, రిటైర్డ్ ఇంజనీర్ ఛీఫ్ అనిశెట్టి వెంకట సుబ్బారావు, బాలిపల్లి రాంబాబులు మాట్లాడుతూ బలమైన నేతగా ఉన్న కురుమళ్ళ రాంబాబు జనసేనలో చేరడం ఆనందదాయ కమని, ఆయన రాకతో పార్టీ మరింత బలోపేతవ య్యిందని, అందరూ కలసి సమన్వయంతో పని చేసి పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీని గెలిపిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో కర్నీడి శ్రీను, సలాది బాబులు, తోలేటి శిరీష, చల్లా లక్ష్మీ, మశేన్ రెడ్డి, జవ్వాది వాడపల్లి, రధసారధి మరియు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 31వ వార్డులో ఘనంగా

## బాబు రాజేంద్రప్రసాద్ 134వ జయంతి



విశాఖపట్నం: చిరస్మరణీయులు బాబు రాజేంద్రప్రసాద్ అని నగర కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్, ఉత్తర నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె గోపాల్‌రెడ్డి అన్నారు. దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ 134వ జయంతి సందర్భంగా సోమవారం 31వ వార్డుం రైల్వే న్యూకాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దేశ తొలి రాష్ట్రపతిగా బాబు రాజేంద్రప్రసాద్ పనిచేసి దేశ ప్రజల హృదయాలలో చిరస్మరణీయంగా నిలిచిపోయారని అన్నారు. బాబు రాజేంద్రప్రసాద్ అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగా కూడా పనిచేశారని చెప్పారు. స్వతంత్ర సంగ్రామంలో కూడా ఆయన పోరాట పఠిమ అనిర్వచణీయమని అటువంటి మహానీయుడు జయంతి జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. నాటి నాయకుల కోసం నేటి తరానికి తెలియ జేయడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రోత్సహిస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రాధాన ఉపాధ్యాయురాలు వేలంగిని, వాణి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 25 మందితో

## ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గాం ఎంపిక



యలమంచిలి, ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా శిక్షణా తరగతులు సంధర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శివారెడ్డి ప్రకటించారు. జిల్లా కార్యవర్గం 8 మందితో పాటు జిల్లా కమీటి సభ్యులు 25 మందిని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా వై. అప్పలరాజు, జిల్లా కార్యదర్శిగా జి. ఫణీంద్రకుమార్, జిల్లా ఉపాధ్యాక్షులగా పి. సుగుణ, మాణిక్యం, ఓబులేష్, ఎమ్. మహేష్, జిల్లా సహాయ కార్యదర్శిలుగా ఎమ్. రమణ, నగేష్, దుర్గలత, కె. సోమేష్ తదితరులు జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఉండగా మిగిలిన 25 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఉంటారని శివారెడ్డి ప్రకటించారు. నూతనంగా ఎన్నికయిన కార్యవర్గం మాట్లాడుతూ విధ్యార్థులు మాపై ఉంచిన నమ్మకంతో భవిష్యత్‌లో విధ్యార్థులు సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా నూతనకార్యవర్గానికి విధ్యార్థులందరూ అభినందనలు తెలియాజేశారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.వి.వి. సత్యనారాయణ, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు దొర, యేసుదాసు, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో కిక్కిరిసిన పుణ్యక్షేత్రలు

యలమంచిలి, రాంబిల్లి మండలం, జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రం కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు పోటెత్తారు. ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు తర్వాత క్షేత్రపాలకుడు ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకుడు ధర్మలింగేశ్వరస్వామికి పూజలు చేశారు. కల్యాణ వినాయకుడు కాశీ విశ్వేశ్వరస్వామి, సహస్ర లింగేశ్వరస్వామి, షిర్డి సాయి బాబులను దర్శించుకుని భక్తులు పూజలు చేశారు.

## చిత్రభాను

# నా కెరీర్‌ను బాహుబలి అలా చేసింది.. సైరాలో చిరంజీవితో నటించడం.. తమన్నా



**మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా కెరీర్ ఓ పక్క విజయాలు, మరోపక్క అపజయాలతో సాగిపోతున్నది. రొమాంటిక్ పాత్రల్లో కనిపిస్తూనే బాహుబలి లాంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. సైరా, దటీజ్ మహాలక్ష్మీ తదితర చిత్రాలతో కెరీర్‌ను పరుగులు పెట్టిస్తున్నది. ప్రస్తుతం నెక్స్ట్ ఏంటీ అనే చిత్రంలో గ్లామర్ రోల్‌లోనూ, అలాగే బాధ్యతాయుతమైన యువతి పాత్రలో కనిపించబోతున్నారు. బాలీవుడ్ దర్శకుడు కునాల్ కోహ్లీ నేరుగా తెలుగులో రూపొందిస్తున్న నెక్స్ట్ ఏంటీ చిత్రం డిసెంబర్ 7న రిలీజ్ అవుతున్న నేపథ్యంలో మీడియాతో తమన్నా ముచ్చటించారు. తమన్నా వెల్లడించిన విషయాలు ఆమె మాటల్లోనే..**

నా వయసుకు తగిన పాత్రలో చాలా కాలంగా నా వయసుకు తగ్గిన పాత్రల్లో నటించాలని అనుకొంటున్నప్పుడు డైరెక్టర్ కునాల్ కోహ్లీ నాకు నెక్స్ట్ ఎంటీ అనే సినిమా కథ చెప్పారు. చాలా కమర్షియల్ సినిమాలు చేశాను. కానీ ఓ యూత్ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ చేయలేదు. కంటెంట్‌కు ఎక్కువ స్కోప్ ఉన్న సినిమా. సినిమా అంతా లండన్‌లో జరుగుతుంది. ఓ అమ్మాయి జర్నీలా సినిమా ఉంటుంది. చీర కట్టుకొంటే ఆంటీ అంటారు సాధారణంగా అమ్మాయికి చాలా రకాలుగా పేర్లు, ట్యాగులు ఉంటాయి. చీరకట్టుకొంటే ఆంటీ అంటారు. షార్ట్స్, మినీస్ వేసుకొంటే మరో పేరు పెడుతారు. అమ్మాయిలకు సొంత నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉండదు. కానీ అలాంటి అవకాశం కల్పించాలి. పెద్దల తమ పిల్లల అభిప్రాయలను ఎలా ట్రీట్ చేస్తారు. రిలేషన్‌షిప్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉంటాయి. రొమాన్స్ ప్రాధాన్యం ఉన్న సినిమా. బాక్సాఫీస్ వద్ద యూత్ సబ్జెక్ట్‌కు మంచి రెస్పాన్స్ వస్తున్నది. అందుకే ఈ సినిమాలో నటించాలని అనుకొన్నాను. ఎప్పుడూ సెక్స్ ఆలోచనేనా? నువ్వు 2 మినిట్స్ గాడివే: తమన్నా మాటలు హాట్ టాపిక్ తెలుగు సినిమా మారిపోయింది గత రెండు ఏళ్లలో తెలుగు సినిమా చాలా మారిపోయింది. చాలా కొత్త కథతో సినిమాలు వచ్చాయి. ప్రేక్షకులు కొత్త సినిమాలను ఆదరిస్తున్నారు. అందుచేతనే బాలీవుడ్‌లో మన చిత్రాలు రీమేక్ అవుతున్నాయి. అలాంటి కోవలోనే వచ్చే సినిమా నెక్స్ట్ ఏంటీ. ఈ సినిమా చూసి హ్యాపీగా ప్రేక్షకులు బయటకు వస్తారు. హాలీవుడ్‌లో ఉడీ అలెన్ పాత్ర మాదిరిగా నా పాత్ర ఉంటుంది.



నా స్వభావానికి చాలా దగ్గరగా నెక్స్ట్ ఎంటీ సినిమా కథ చదివినప్పుడు కథకు చాలా కనెక్ట్ అయ్యాను. కథలోని పాత్ర నా స్వభావానికి చాలా దగ్గరగా ఉంటుంది. నేను చెప్పిన డైలాగ్స్‌కు నాక నేను రిలేట్ అయ్యాను. అందుకే నా నిక్‌నేమ్‌ను ఈ సినిమాలో పెట్టమని దర్శకుడిని కోరాను. దాంతో సినిమాలో నా పాత్రకు టామీ అని పేరు పెట్టారు. సందీప్ కిషన్, నవదీప్ ఈ సినిమాలోని హీరోల పాత్రకు సరిగ్గా సరిపోతారు. సందీప్ అనగానే నాకు కొంత ఎనర్జీ వచ్చింది. నవదీప్‌తో కంఫర్ట్ ఫీలయ్యాను. తండ్రీ, కూతుళ్ల కథగా నెక్స్ట్ ఎంటీ చిత్రంలో నా తండ్రిగా శరత్ బాబు సర్ నటిస్తున్నాడు.

ఇప్పటి వరకు తెలుగు సినిమాల్లో ఎక్కువగా తండ్రి, కొడుకుల మధ్య రిలేషన్‌పై సినిమాలు వచ్చాయి. కానీ కూతురు, తండ్రి మధ్య రిలేషన్‌పై ఈ సినిమా చెబుతుంది. శరత్ బాబు గారు సింగిల్ పేరెంట్. ఆయన కూతురిగా నేను నటించాను. తండ్రి, కూతుళ్ల రిలేషన్ కాకుండా వారి మధ్య ఫ్రెండ్‌షిప్ మాత్రమే కనిపిస్తుంది.

భాష అనేది సమస్య కాలేదు నెక్స్ట్ ఏంటి సినిమా యూనివర్సల్ సబ్జెక్ట్. తెలుగు తీయడానికి దర్శకుడు కునాల్ కోహ్లీకి ఎలాంటి కష్టం కాలేదు. భాష అనే కేవలం కమ్యూనికేషన్ మాత్రమే. లండన్‌లో షుట్ చేయడం వల్ల భాష సమస్య రాలేదు. ఈ సినిమా బ్యాక్‌డ్రాప్ రూరల్ అయితే కునాల్ కష్టం ఉండేది. గ్రామీణ కథ ఉంటే లాంగ్వేజ్, నేటివిటీ గురించి ఆలోచించాల్సి వచ్చేది. అర్బన్ బ్యాక్‌డ్రాప్‌తో ఉండటం వల్ల ఎలాంటి సమస్యలు రాలేదు. బాహుబలి మూవీతో నా కెరీర్‌లో బాహుబలి సినిమా మంచి గుర్తింపునిచ్చింది. నా మీద నమ్మకం పెట్టుకొని అలాంటి క్యారెక్టర్ ఇవ్వడం అదృష్టమే. అలాంటి పాత్రలు చేయడం వల్ల నాపై నాకు నమ్మకం కలిగింది. నెక్స్ట్ ఎంటీ సినిమాలోని రోల్ నా కెరీర్‌కు ప్లస్ అవుతుంది. మెగాస్టార్ చిరంజీవితో సైరాలో నటించే అవకాశం దక్కింది. సైరాలో నా పాత్రఏంటో చెప్పలేను. ఇంకా షుటింగ్ మిగిలి ఉంది. క్వీన్ రీమేక్ దటీజ్ మహాలక్ష్మీ వచ్చే ఏడాది రిలీజ్ అవుతుంది. ఇక తమిళ చిత్రంలో నటిస్తున్నాను. సూర్యతో రెండోసారి నటించడం హ్యాపీగా ఉంది.

---

# కమర్షియల్ లెక్కలు తెలియవు!



కథాంశాల ఎంపికలో వైవిధ్యానికి ప్రాధాన్యతనిస్తారు సుమంత్. ప్రతి సినిమాలో పాత్రలపరంగా కొత్తదనాన్ని ఆవిష్కరించాలని తపిస్తారు. గత ఏడాది మళ్లీరావా చిత్రంతో చక్కటి విజయాన్ని సొంతం చేసుకున్నారాయన. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం సుబ్రహ్మణ్యపురం. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 7న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా సుమంత్ పాత్రికేయులతో సంభాషించారు.

**ఈ సినిమాలో మీ పాత్రపరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

సన్నివేశాలు వాస్తవికంగా, యథార్థానికి దగ్గరగా వుండటాన్ని నేను ఇష్టపడతాను. భారీ ఇంట్రడక్షన్స్ సీక్వెన్స్‌లు, ఫైట్ ఎపిసోడ్స్..స్లో మోషన్ బిల్డప్‌లు..ఇలాంటి కమర్షియల్ అంశాల్ని ఎక్కువగా నమ్మను. ఆ తరహా పాత్రలు నాకు ఇష్టం ఉండదు. అయితే ఇతర హీరోల హీరోయిజాన్ని మాత్రం ఎంజాయ్ చేస్తాను. మహేష్‌బాబు, ఎన్టీఆర్ సినిమాలు చూస్తూ విజిల్స్ వేస్తాను.

**సుబ్రహ్మణ్యపురం ఎలా ఉండబోతున్నది?**

నేనెప్పుడు కమర్షియల్ లెక్కల గురించి ఆలోచించి సినిమాలు చేయను. మళ్లీరావా కథ వినగానే బాగా నచ్చింది. అది కమర్షియల్‌గా వర్కవుట్ అవుతుందా? లేదా? అని ఆలోచించలేదు. కథ నా హృదయాన్ని కదిలిస్తే చాలు సినిమా అంగీకరిస్తాను. మళ్లీరావా సినిమా తర్వాత వరుసగా రొమాంటిక్ కథలతో అవకాశాలు వస్తాయని భావించాను. కానీ అందరూ థ్రిల్లర్ జోనర్‌తో వచ్చారు. ఒకేరకమైన కథలు చేయడం నాకు ఇష్టం ఉండదు. ఎప్పుడూ విభిన్న ఇతివృత్తాలను ఎంచుకుంటుంటాను.

**థ్రిల్లర్ సినిమాలు అంతగా ఇష్టం ఉండవని చెప్పారు కదా?**

నిజానికి థ్రిల్లర్ సినిమాలు నాకు నచ్చవు. ఈ కథ వినడానికి ఓకే చెప్పినప్పుడు కూడా నచ్చదేమో అనుకున్నాను. కానీ దర్శకుడు రెండున్నరగంటల పాటు ఇంట్రెస్టింగ్‌గా స్టోరీ నరేట్ చేశాడు. ఆద్యంతం థ్రిల్లింగ్‌గా అనిపించింది.

**ఈ కథలో మీకు బాగా నచ్చిన అంశాలేమిటి?**

దర్శకుడు అవార్డులు గెలుచుకున్న లఘు చిత్రాల్ని తీశాడు. అతని షార్ట్‌ఫిల్మ్ చూసిన తర్వాత నమ్మకం కలిగింది. చిన్న బడ్జెట్‌తో తీసే సినిమా కాదిది. కథానుగుణంగా గ్రాఫిక్స్ అవసరం. ఈ సినిమాలో నేను కార్తీక్ అనే యువకుడి పాత్రలో కనిపిస్తాను. అతను నాస్తికుడు. హేతువాది. పురాతన ఆలయాల గురించి పరిశోధన చేసే వ్యక్తి. ఓ పరిశోధనలో అతనికి తెలిసిన నిజాలేమిటన్నదే చిత్ర కథ.

**నిజజీవితంలో మీరు నాస్తికులా?**

కాదు. అలాగనీ పూర్తి ఆస్తికున్నికాదు. దేవుడు ఉన్నాడో లేదో అనే ఒక సందిగ్ధంతో ఉంటాను. అయితే గుళ్లకు వెళ్తాను. మన పండుగలు, సంప్రదాయాల్ని గౌరవిస్తాను. ఆలయాలకు వెళ్లినప్పుడు కేవలం ప్రార్థన చేస్తాను కానీ ఎలాంటి కోరికలు కోరను.

**ఈ సినిమాలో గ్రాఫిక్స్‌కు ఉన్న ప్రాధాన్యత ఏమిటి?**

గ్రాఫిక్స్ అంటే బాహుబలి రేంజ్‌లో ఉండవు. కథానుగుణంగా ఎంత మేరకు అవసరమో అంతే గ్రాఫిక్స్‌ను రూపొందించాం. సీజీ వల్ల కథకు మరింత హంగులు చేకూరాయి. కథ మొత్తం స్క్రిప్ట్‌ప్రకారమే నడుస్తుంది. ఎక్కడా అనవసర సన్నివేశాలు కనిపించవు.

**ఈ సినిమాకు రానా వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఆ ఆలోచన మీదేనా?**

కథను వర్ణించడానికి నేపథ్యంలో చక్కటి తెలుగు ఉచ్ఛారణ కలిగిన గళం అవసరం ఏర్పడింది. రానా మంచి ఛాయిస్ అనిపించింది. రానా కథ విని వెంటనే వాయిస్ ఓవర్ ఇవ్వడానికి ఒప్పుకున్నాడు.

**ఎన్టీఆర్ బయోపిక్‌లో మీ తాతగారి పాత్రను చేయడం ఎలాంటి అనుభూతినిచ్చింది?**

తాతగారి పాత్ర చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. క్రిష్ నా అభిమాన దర్శకుల్లో ఒకరు. ఆయన సినిమాలన్నీ చూశాను. ఎన్టీఆర్ బయోపిక్‌లో నా పాత్ర నిడివి ఎక్కువగా ఉంటుంది. బాలకృష్ణగారితో పనిచేయడం మంచి అనుభూతినిచ్చింది. సినిమాలోని రెండు భాగాల్లో నా పాత్ర ఉంటుంది. ఈ సినిమాలో నటించడం గొప్ప బాధ్యతగా భావించాను.

**తదుపరి చిత్రాల గురించి?**

ఇదంజగత్ విడుదలకు సిద్ధంగా ఉంది. ఆ తర్వాత కొత్త దర్శకుడితో సినిమా చేయబోతున్నాను. పూర్తిస్థాయి ఫ్యామిలీ డ్రామా అది. అన్నాచెల్లెల అనుబంధం మీద కథ ఉంటుంది.

---

# మారన మాస్!



రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా తమిళ చిత్రం పేట్ట. కార్తీక్ సుబ్బరాజు దర్శకుడు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధిమారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్రిష కథానాయిక. విజయ్ సేతుపతి, శశికాంత్, సిమ్రాన్, మేఘా ఆకాష్, నవాజుద్దీన్ సిద్ధిఖీ, బాబీసింహా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఆలపించగా అనిరుధ్ సంగీతం అందించిన మారన మాస్ అనే గీతాన్ని సోమవారం విడుదల చేస్తున్నారు. సినిమాలో ఈ పాట హైలైట్‌గా నిలవనుందట. ఈ సందర్భంగా రజనీ కొత్త లుక్‌కు సంబంధించిన స్టిల్‌ను చిత్ర దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాత కళానిధి మారన్ సన్నాహాలు చేస్తున్నారు.


వైజాగ్ : జగదాంబ 70MM AC DTS 3D
వైజాగ్ : మెలోడీ 4K AC DTS 3D
వైజాగ్ : శారద AC DTS (పాంట్) 3D
వైజాగ్ : జోతి AC DTS 3D
వైజాగ్ : శ్రీకన్య AC DTS 3D
వైజాగ్ : సంగం AC DTS 3D
వైజాగ్ : కిన్నెర AC DTS 3D
వైజాగ్ : కామేశ్వరి AC DTS 3D (Dolby Atmos Opening)
వైజాగ్ : వరుణ్ ఐనాక్స్
మద్దిలపాలెం : CMR ఐనాక్స్
వైజాగ్ : చిత్రాలయ ఐనాక్స్
వైజాగ్ : ముక్తాస్ సినిమాస్
104 ఏరియా : శ్రీలక్ష్మీ నరసింహ స్క్రీన్-1 3D
గోపాలపట్నం : శంకర AC DTS
గోపాలపట్నం : సుకన్య AC DTS 3D
గాజువాక : లక్ష్మీ AC DTS 3D
గాజువాక : లక్ష్మీకాంత్ AC DTS
షీలానగర్ : STBL-1 OUTDOOR AC DTS
షీలానగర్ : STBL-2 AC DTS 3D Opening
అచ్యుతాపురం : STBL-1 AC DTS
సబ్బవరం : STBL-1 AC DTS
శ్రీహరిపురం : SVC లిఖిత AC DTS 3D
కూర్మన్నపాలెం : అన్నపూర్ణ AC DTS
పెద్దగంట్యాడ : అరుణ సినీప్లెక్స్ AC DTS
విజయనగరం : లీలామహల్ AC DTS
విజయనగరం : న్యూపూర్ణ AC DTS 3D
విజయనగరం : కృష్ణ సినిమా AC DTS 3D
విజయనగరం : NCS ఐనాక్స్ AC DTS
శ్రీకాకుళం : SVC రామలక్ష్మణ AC DTS 3D
శ్రీకాకుళం : కీర్తిక AC DTS
శ్రీకాకుళం : సన్‌మ్యాక్స్ AC DTS 3D
శ్రీకాకుళం : మారుతి AC DTS 3D
అనకాపల్లి : పర్తిసాయి AC DTS 3D
అనకాపల్లి : రామచంద్ర AC DTS
తగరపువలస : సప్తగిరి AC DTS
తగరపువలస : రాములమ్మ AC DTS 3D
పార్వతీపురం : సౌందర్య AC DTS 3D

ఇండియన్ స్క్రీన్‌పై ఇంతవరకూ చూడని అద్భుత సాంకేతిక విన్యాసం!



SUPERSTAR RAJINIKANTH
SUBASKARAN PRESENTS
AKSHAY KUMAR
LYCA
SHANKAR'S 2.0
MUSIC BY A.R. RAHMAN
రిలీజ్: శ్రీ వెంకటేశ్వర ఫిలింస్, ఫోన్: 0891-2515757

నర్సీపట్నం : బంగార్రాజు AC DTS 3D
నర్సీపట్నం : రాజ్యలక్ష్మి AC DTS
యలమంచిలి : పరమేశ్వరి AC DTS
పాయకరావుపేట : SVC లక్ష్మి AC DTS 3D (Dolby Atmos Opening)
పలాస : వెంకటేశ్వర AC DTS
పలాస : హరిశంకర AC DTS
రాజాం : SVC అక్షర AC DTS 3D Opening
పాలకొండ : రఘుకళామందిర్ AC DTS
చీపురుపల్లి : వంశీ AC DTS
బొబ్బిలి : వెంకటకృష్ణ AC DTS
సాలూరు : లక్ష్మీ AC DTS
గజపతినగరం : గంగరాజు AC DTS
కొత్తవలస : రాజా AC DTS 3D Opening
చోడవరం : పూర్ణ AC DTS
చోడవరం : సాయిలక్ష్మీ స్క్రీన్-1 AC DTS
నరసన్నపేట : రాజేశ్వరి AC DTS
ఎస్.కోట : వెంకటేశ్వర AC DTS
ఇచ్ఛాపురం : పూర్ణ AC DTS
టెక్కలి : భవాని AC DTS
సోంపేట : శివ AC DTS
ఆముదాలవలస : శ్రీదేవి AC DTS
హిరమండలం : వరలక్ష్మి AC DTS
రావికమతం : వెంకటేశ్వర AC DTS
నెల్లిమర్ల : సాయిసుభద్ర AC DTS
రణస్థలం : SVC రామాంజనేయ AC DTS
కొత్తూరు : గౌరిశంకర AC DTS
పొందూరు : ఎం.వి.బాలాజీ AC DTS
బలిజిపేట : రామకృష్ణ AC DTS
వీరఘట్టం : జి.ఎం.ఆర్. AC DTS
పాతపట్నం : ఉమామహల్ AC DTS
అడ్డురోడ్డు : లక్ష్మీనరసింహ AC DTS
జామి : లక్ష్మీనరసింహ AC DTS
మాడుగుల : కనకరత్న AC DTS
మాకవరపాలెం : శ్రీకన్య DTS
వేములపూడి : వెంకటవేమ AC DTS
కవిటి : మహాలక్ష్మి AC DTS
మందస : మహేంద్ర AC DTS

BLOCK BUSTER



SUPERSTAR RAJINIKANTH
SUBASKARAN PRESENTS
AKSHAY KUMAR
LYCA
SHANKAR'S 2.0
MUSIC BY A.R. RAHMAN
రిలీజ్: శ్రీ వెంకటేశ్వర ఫిలింస్, ఫోన్: 0891-2515757

# ఆహార నియమాలపట్ల నియంత్రణతోనే ఆరోగ్యం

## ఏఎంసి గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఇన్‌ఛార్జి విభాగాధిపతి డాక్టర్ ఎల్‌ఆర్‌ఎస్ గిరినాధ్



విశాఖసిటీ: నేటి యాంత్రిక జీవనంలో పనిభారంతో పాటు మానసిక ఒత్తిడులకు లోనౌతూ వివిధ రకాల వ్యాధులకు ప్రజలు గురౌతున్నారు. కాస్తంత ముందు జాగ్రత్త, ఆహార నియమాలపట్ల నియంత్రణ సాధిస్తేనే ఆరోగ్యకరమైన జీవనం కొనసాగించవచ్చునని ప్రముఖ వైద్యుడు, ఏఎంసి గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఇన్‌ఛార్జి విభాగాధిపతి డాక్టర్ ఎల్‌ఆర్‌ఎస్ గిరినాధ్ పేర్కొన్నారు. మురళీనగర్, మాధవధార వెలమ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో మాధవధార ఉడా కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సహకారంతో ప్రముఖ సంఘ సేవకుడు, వ్యాపారవేత్త బోకం శ్రీనివాస్ ఆర్థిక సహాయంతో మాధవధార ఉడా కమ్యూనిటీ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఎల్.ఆర్.ఎస్. గిరినాధ్ పాల్గొని ఉదరకోశ సంబంధిత వ్యాధులు (గ్యాస్ట్రో ఎంట్రాలజీ) మరియు కామెర్లు, గ్యాస్ ట్రబుల్స్, కడుపు నొప్పి, అల్సర్లు, ప్రేగు పూత తదితర సంబంధిత వ్యాధుల బారిన పడిన సుమారు 216 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా 2నెలలకు సరిపడా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరినాధ్ మాట్లాడుతూ సరైన ఆహార నియమాలు పాటించకపోవడంతో కడుపునొప్పి, గ్యాస్ ట్రబుల్స్ వంటి వివిధ రకాల ఇబ్బందులకు గురౌతున్నారని అన్నారు. సమయానికి ఆహారం తీసుకోకపోవడం వలన గ్యాస్‌కు సంబంధించిన ఇబ్బందులు కలుగుతాయని, వీటికి చక్కటి పరిష్కారంగా వ్యాయామం, నడక వంటివి చేయాలని ఆయన సూచించారు. వీలయినంత వరకూ బయట ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా పచ్చకామెర్ల విషయంలో జాగ్రత్త వహించాలని సంబంధిత పరీక్షలు నిర్వహించకుండా మందులు తీసుకోవడం మంచిది కాదని హెచ్చరించారు. హైపటైటిస్-బి వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించుకోవాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్యులతో పాటు వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు రొంగలి జగన్నాధం, పాశల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణ, లాలం జానకీరాం, డీ. దేముడు, బాబు, ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ బి. దేముడు, సత్యనారాయణ, సన్యాసిరావు, బి. శ్రీను, సిహెచ్. శ్రీనివాసరావు మరియు అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొని వారి వారి ఆరోగ్య సమస్యలపై డాక్టర్ గిరినాధ్ సలహాలు, సూచనలు తీసుకున్నారు.



## మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం

### సంఘ సేవకుడు బోకం శ్రీనివాస్

ప్రజారోగ్యంపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య సమస్య చిన్నదైనా తక్షణమే సంబంధిత వైద్యుల దగ్గరికి వెళ్లి వారి సలహాల మేరకు తగిన సూచనలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రముఖ సంఘ సేవకుడు, వ్యాపారవేత్త బోకం శ్రీనివాస్‌అన్నారు.

మున్ముందు ప్రాంతాలకతీతంగా అన్ని ప్రాంతాలలో కూడా ఈ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఆరోగ్యంపై ప్రజలకు పూర్తి అవగాహన కార్యక్రమాలు చేపడతామని, ఇందుకు ప్రజల సహకారమవసరమని బోకం శ్రీనివాస్ పేర్కొన్నారు.

# గ్యాస్ పైపులైను పనులను అడ్డుకున్న స్థానికులు

### - రైతులకు నష్టపరిహారం అందజేయాలి

### -పైపులైనుకు వ్యతిరేకంగా నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న తోట నగేష్



నక్కపల్లి : విశాఖ జిల్లా, నక్కపల్లి మండలం గొడ్డిచెర్ల గ్రామానికి చెందిన భూములలో గ్యాస్ ఇండియా ట్రాన్స్‌పోర్టు లిమిటెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్యాస్ పైపులైన్ పనులను స్థానిక ప్రజలు, నాయకులు అడ్డుకున్నారు. పైపులైన్ నిర్మాణంలో భూముల్లో వేసిన పంటలను తొలగించి, సంబంధిత రైతులకు నష్టపరిహారం అందించకుండా పైపులైన్ పనులు సాగిస్తుండడంతో ఆగ్రహించిన రైతులు పైపులైన్ పనులు జరిగే చోట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంధాలయ చైర్మన్ తోట నగేష్ మాట్లాడుతూ పైపులైన్ వెళ్లే భూముల రైతులకు ఇచ్చే నష్ట పరిహారం చాలా తక్కువగా ఉందని, నష్ట పరిహారాన్ని పెంచాలని కోరారు. పక్క గ్రామాల్లో ఖజాఅఖఎ ఏ. పి. ఐ. ఐ సి తీసుకున్నట్లు ఎకరాకు 18 లక్షలు ఇచ్చి ప్రభుత్వం తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన నష్టం పరిహారం చెల్లించాలని అన్నారు. రైతులకు న్యాయం జరగకుండా ఏ చర్యలు తీసుకున్నా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు, ఈ విషయంలో న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సి.ఐ.టి.యూ జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ పైపులైన్ బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించిన తరువాతే పనులు జరపాలని, అప్పటివరకు పనులు నిలుపుదల చేయాలని అన్నారు.ఈ సందర్భంగా వై.సి.పి సీనియర్ నాయకులు వీసం రామకృష్ణ మాట్లాడుతూ 2013 భూ చట్టం ప్రకారం రైతులకు నష్టపరిహారం అందిస్తేనే పైపులైన్ వేసుకొనుటకు అనుమతిస్తామని,లేదంటే రైతుల ఆత్మహత్యలు చూస్తారని,పోరాటం ఎలా ఉంటుందో ప్రభుత్వానికి చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంధాలయ చైర్మన్ తోట నగేష్,వై.సి.పి సీనియర్ నాయకులు వీసం రామకృష్ణ, సి.ఐ.టి.యూ జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజు, పైపులైన్ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో దక్షిణమండల టిటి పోటీలు ప్రారంభం

సాగర్‌నగర్‌: అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేధికగా దక్షిణ మండల అంతర్ విశ్వ విద్యాలయాల టేబుల్ టెన్నిస్ పోటీలు (పురుషుల) సోమవారం అట్టహసంగా ప్రారంభంమయ్యాయి. పోటీలను వి.ఎమ్. ఆర్.డి.ఎ మెట్రో పాలిటన్ కమిషనర్ పి.బసంత్ కుమార్ ముఖ్యఅతిథిగా హజరై ప్రారంభించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాదరావు, గీతం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గోన్నారు.


**LOANS / లోన్స్**

**HAPPY HOMES**

We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,

**94902 33750**


## నిత్య అన్నదాన పధకానికి రూ.51,116/- విరాళము



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఎంతో ప్రతిష్టాత్మకముగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పధకానికి తూ.గో.జిల్లా తొండంగి మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన ఆకాశపు.సత్యనారాయణ శ్రీమతి ప్రభావతి గారు రూ.51,116/- విరాళమును దేవస్థానం ఈవో ఎమ్.జితేంద్రకు అందజేసి ప్రతీ సంవత్సరం కార్తీక శుద్ధ ద్వాదశి నాడు అన్నదానం జరిపించవలెనని కోరారు.

## స్టీల్‌ప్లాంట్‌లో ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



విశాఖపట్నంః అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ స్టీల్‌ప్లాంట్ దివ్యాంగులకు పలు ఆటల పోటీలను నిర్వహించింది. కల్నల్ పి.కె. నాయుడు ఉక్కు స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో విజేతలకు దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) దాస్ బహుమతులను అందజేశారు. దివ్యాంగుల సాధికారతకు స్టీల్‌ప్లాంట్ కృషి చేస్తుందన్నారు. సీఎస్ఆర్‌లో భాగంగా స్టీల్‌ప్లాంట్ దివ్యాంగులకై పలు కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తూ వారిని కూడా పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు కృషి చేస్తుంది.






VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com